చిరిగిన జెండాకు వందనమెలా?



తిరుపతి ఆర్టీసీ బస్టాండు సమీపంలో సుబ్బలక్ష్మి విగ్రహం కూడలిలోని భారీ జాతీయ జెండా చిరిగి పేలికలవుతోంది. ఎండకి ఎండీ, వానకు చివికి ఇలాగే రెపరెపలాడుతోంది. తక్షణం ఇక్కడ కొత్త జాతీయ పతాకాన్ని ఏర్పాటు చేయాల్సివుంది.

అనిల్.. అసాధ్యుడే

- వైసీపీ ప్రభుత్వంలో సెటిల్మెంట్లు
- పవన్‌పై దాడి ఘటనలో కీలక నిందితుడు
- వీడియో ఆధారాలతో కేసు నమోదు
- ఫైబర్ లాఠీ ఇచ్చింది ఏఎస్ఐ కుమారుడు!
- దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు



వైసీపీ సోషల్ మీడియా అధ్యక్షుడు అనిల్‌కుమార్ రెడ్డి కార్యాలయంలో పవన్‌కుమార్‌ను చితకబాదుతున్న అనిల్‌కుమార్ రెడ్డి

తిరుపతి (నేరవిభాగం), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మా వైసీపీ సోషల్ విభాగం అధ్యక్షుడు అనిల్‌కుమార్‌రెడ్డి అమాయకుడు. పవన్‌పై దాడి ఘటనలో అతడికి సంబంధం లేదు. ఇదీ ఆయన అరెస్టు సందర్భంగా తిరుపతి ఈస్ట్ పోలీసుతో వైసీపీ నేతల వాదన. కానీ, ఈ కేసులో పోలీసులు దర్యాప్తు చేస్తున్న కొద్దీ అనిల్‌కుమార్‌రెడ్డి అమాయకుడు కాదు.. అసాధ్యుడని తెలుస్తున్నట్లు సమాచారం. రెంటల్ బైకు తీసుకుని అద్దె చెల్లించలేదంటూ పులిచెర్ల మండలం మొరవపల్లికి చెందిన పవన్‌కుమార్‌ను గత బుధవారం మధ్యాహ్నం తిరుపతిలోని అనిల్ కార్యాలయానికి పట్టుకొచ్చారు. ఫైబర్ లాఠీ, దుడ్డుకర్రతో కొడుతూ.. కాళ్లతో తన్నుతూ అమానవీయంగా దాడి చేశారు. ఈ వీడియోలు వైరల్ కావడంతో భూమన అభినయ్ అనుచరుడు, నమ్మినబంటు అయిన అనిల్‌కుమార్‌రెడ్డి పేరు ప్రముఖంగా బయటకు వచ్చింది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు సెటిల్మెంట్లు, ఆర్థిక లావాదేవీలకు అనిల్ పాల్పడినట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. భూ దందాలు చేసినట్లు చెబుతున్నారు. ఓ నేతకు ఇతడు బినామీ అన్న ప్రచారమూ జరుగుతోంది. ఇతడి వద్ద ఓ బ్యాచ్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఇతడి సెల్‌ఫోను కాంటాక్ట్స్, కాల్‌డేటా ఆధారంగా ఆ బ్యాచ్‌ను గుర్తిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ బ్యాచ్‌తో అనిల్ దౌర్జన్యాలు, దందాలు చేసేవాడని పోలీసుల విచారణలో బయటకు వచ్చినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ క్రమంలోనే ఇతడిని వైసీపీ సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడిగా నియమించారు. ఈ దౌర్జన్యాలు, దందాల నేపథ్యంలోనే కూటమి ప్రభుత్వం రాగానే తన నివాసాన్ని ఎస్టీవీ నగర్ నుంచి పద్మావతిపురంలోని భూమన ఇంటి సమీపానికి మార్చినట్లు చెబుతున్నారు. ఇటీవల ఎస్టీవీనగర్‌లో జరిగిన ఓ ఘటనకు సంబంధించి అనిల్ సోదరుడు, తండ్రిపైనా కేసు నమోదు కావడం గమనార్హం. కాగా, పవన్ కుమార్‌పైనా అనిల్‌కుమార్ రెడ్డి దాడి చేసినట్లు.. విచక్షణారహితంగా దినేశ్ కొట్టే సమయంలోనూ పక్కనే ఉన్నట్లు వీడియోల ఆధారంగా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిసింది. ఈ కేసులో నిందితులైన అనిల్‌కుమార్ రెడ్డి, జగదీశ్వర రెడ్డి టీమ్‌లో ఫైనాన్సు లావాదేవాలు నడుపుతున్న దినేష్ ఉన్నాడు. ప్రస్తుతం ఈ ముగ్గురూ రిమాండులో ఉన్నారు. కాగా, దినేష్ జనసేన పార్టీ నేత అంటూ వైసీపీ ప్రచారం చేసింది. ఈ క్రమంలో తమ పార్టీకి, అతడికి సంబంధం లేదంటూ జనసేన ముఖ్య నేతలు పోలీసులకు స్పష్టం చేసినట్లు సమాచారం.

15కాదు.. 50 మంది

పవన్‌పై దాడి ఘటనకు సంబంధించి పోలీసుల విచారణలో నిందితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతూనే ఉంది. తొలి రోజున నలుగురు, ఆ తర్వాత 15 మంది అని అంచనాకు రాగా.. ఇప్పుడా సంఖ్య 50కి చేరినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. వీరంతా అనంతపురం, చిత్తూరు, తిరుపతి, కడపకు చెందిన వైసీపీ బ్యాచ్‌గా భావిస్తున్నారు. చిత్తూరులో పవన్‌కుమార్‌ను బంధించి అతడి ద్వారా బలవంతంగా సెల్ఫీ వీడియోలు తీయించిన రవి అనే చోటా రౌడీ కూడా పోలీసుల అదుపులో వున్నట్లు తెలిసింది.

ఫైబర్ లాఠీ ఇచ్చింది ఏఎస్ఐ కొడుకు!

పోలీసులు వాడే ఫైబర్ లాఠీతో పవన్‌కుమార్‌ను దినేశ్ చితకబాదిన వీడియోలు బయటకు వచ్చాయి. దీంతో ఫైబర్ లాఠీ వీరికి ఎక్కడిదన్న ప్రచారం జరిగింది. ఈ దిశగా పోలీసులూ విచారించగా.. జిల్లాలో పనిచేసే ఓ ఏఎస్ఐ కుమారుడు ఇచ్చినట్లు బయట పడిందని తెలిసింది. వైసీపీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న ఇతడు.. లాఠీ తీసుకొచ్చినట్లు సమాచారం. ఈ కేసుకు సంబంధించి విభిన్న కోణాల్లో పోలీసులు దర్యాప్తు సాగిస్తున్నారు.

ఆడుదాం.. ఆంధ్ర

ఆడింది 47 రోజులు. ఖర్చుపెట్టింది రూ.ఐదారు కోట్లు. దుర్వినియోగమైనట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించింది రూ.1.10 కోట్లు. ఇదీ 'ఆడుదాం- ఆంధ్ర' లెక్క

అవినీతి అంతులేనంత!

ఉమ్మడి జిల్లాలో రూ.1.10 కోట్ల దుర్వినియోగం ● ముగిసిన విజిలెన్స్ విచారణ



తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): 'ఆడుదాం.. ఆంధ్ర' అన్నారు. అవినీతి క్రీడకు తెరతీశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రూ.1.1 కోట్ల స్వాహాకు పథకం వేశారు. ఇదంతా విజిలెన్స్ విచారణలో వెలుగు చూసినట్లు తెలిసింది. గతేడాది సార్వత్రి ఎన్నికలకు ముందు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అప్పటి వైసీపీ ప్రభుత్వం ఆడుదాం-ఆంధ్ర కార్యక్రమాన్ని ఆర్భాటంగా ప్రారంభించింది. ఈ సందర్భంగా అవినీతికి పాల్పడ్డారన్న విమర్శలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక విజిలెన్సు విచారణకు ఆదేశించింది. తిరుపతి ప్రాంతీయ విజిలెన్సు ఎస్పీ కరీముల్లా షరీఫ్ నేతృత్వంలో దాదాపు 10 మంది అధికారులు నగరి నియోజకవర్గం నుంచీ విచారణ మొదలు పెట్టి జిల్లా మొత్తం సమగ్రంగా పూర్తి చేశారు. క్రీడా పోటీలకు సంబంధించి పరికరాలు, టీ షర్టుల కొనుగోళ్లు, విజేతల ఎంపికలో అక్రమాలు, పబ్లిసిటీ కోసం ఆయా వస్తువులపై బ్రాండెడ్ స్టిక్కర్లు, క్రీడాకారులకు నాసిరకం కిట్లు సరఫరా చేసినట్లు దర్యాప్తులో వెల్లడైందని తెలిసింది. అలాగే, విజేతలుగా కూడా వైసీపీ కార్యకర్తలనే ఎంపిక చేసినట్లు అధికారులు గుర్తించారు. వివిధ క్రీడల కింద క్రీడాకారులు ఆటలు ఆడినట్లు లెక్కలు చూపించినట్లు సమాచారం. దీంతో పాటు జిల్లా క్రీడా సంఘాల నుంచి ఖర్చు చేసిన మొత్తం కూడా ఈ స్కాం కిందకు వస్తుందని టీడీపీ ఆరోపిస్తున్న నేపథ్యంలో ఆ దిశగానూ విజిలెన్సు అధికారులు విచారించారు. ఇక, ముగింపు ఉత్సవాల సందర్భంగానూ నిధుల దుర్వినియోగం పైనా దృష్టి పెట్టారు. ఇలా అన్ని కోణాల్లో విచారించిన అధికారులు.. సుమారు రూ.1.10 కోట్లు దుర్వినియోగమైనట్లు నిగ్గు తేల్చినట్లు సమాచారం. కర్నూలు విజిలెన్సు విభాగం ద్వారా ప్రభుత్వానికి రెండు రోజుల్లో ఈ నివేదిక అందించనున్నట్లు తెలిసింది. ఆ తర్వాత ప్రభుత్వం కేసులు నమోదు చేసే అవకాశాలున్నాయి.

'స్త్రీ శక్తి'కి 393 బస్సులు



తిరుపతి(ఆర్టీసీ), ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 'స్త్రీ శక్తి' పథకం కింద 393 బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించనున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 15వ తేది నుంచి ఈ ఉచిత ప్రయాణం అందుబాటులోకి రానుంది. మిగిలిన 524బస్సుల్లో ప్రయాణించాలంటే టిక్కెట్లు చెల్లించాలి. ఈ పథకానికి సంబంధించి తుది మార్గదర్శకాలతో సోమవారం ప్రభుత్వం జీవో విడుదల చేసింది. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రోఎక్స్‌ప్రెస్, సిటీఆర్డినరీ బస్సులలో మహిళలకు ప్రయాణం ఉచితం అన్న సంగతి తెలిసిందే. వీటితో పోలిస్తే జిల్లా పరిధిలో తిరుమల, నాన్‌స్టాప్, అంతర్రాష్ట్ర సర్వీసులతో పాటు ఏసీ, లగ్జరీ, డీలక్స్ బస్సులే ఎక్కువగా ఉన్నాయి. కాగా, తుది మార్గదర్శకాలు జారీ అయిన క్రమంలో మహిళల ఉచిత ప్రయాణం అమలుకు ఆర్టీసీ అధికారులు సన్నాహకాలను మరింత ముమ్మరం చేశారు.

ఆర్టీసీ బస్సులు:917(సొంతం 723,అద్దెవి 194)
ఏసీ బస్సులు : 124
నాన్‌ఏసీ బస్సులు: 792

- వెన్నెల 2, ఇంద్ర 12, అమరావతి 10, గ్రీన్ సప్తగిరి(ఎలక్ట్రిక్ ఏసీ) 100
- స్టార్‌లైనర్ 2, సూపర్‌లగ్జరీ 49, అల్ట్రాడీలక్స్ 21, సప్తగిరి ఎక్స్‌ప్రెస్ 298, ఎక్స్‌ప్రెస్ 100, మెట్రోఎక్స్‌ప్రెస్ 14, పల్లెవెలుగు 303, అల్ట్రాపల్లెవెలుగు 5
- ఇంటర్‌స్టేట్ ఎక్స్‌ప్రెస్ 9, పల్లెవెలుగు 4, నాన్‌స్టాప్ 24
- తిరుపతి-తిరుమల మధ్య 342 బస్సులు (సప్తగిరి ఎక్స్‌ప్రెస్, గ్రీన్ ఎలక్ట్రికల్ బస్సులు)నడుస్తున్నాయి. రోజుకు దాదాపు 1,600 ట్రిప్పులతో దాదాపు 45వేల మంది రాకపోకలు సాగిస్తున్నారు. టికెట్ల ద్వారా దాదాపు రూ. 80 లక్షల రాబడి వస్తోంది. ఇది జిల్లా రాబడిలో సగం కావడం గమనార్హం.

మాజీ ఎమ్మెల్యే చెంచురెడ్డి కన్నుమూత



చెంచురెడ్డి (ఫైల్ ఫొటో)

శ్రీకాళహస్తి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే తాటిపర్తి చెంచురెడ్డి అనారోగ్యంతో చికిత్స పొందుతూ సోమవారం కన్నుమూశారు. శ్రీకాళహస్తి మండలం ఎంపేడులో 1937 జూలై 1న ఆయన జన్మించారు. శ్రీకాళహస్తి పట్టణంలోని పొన్నాలమ్మ ఆలయం సమీపంలో స్వర్ణముఖి నది ఒడ్డున స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. బీఏ, బీఎల్ విద్యాభ్యాసం పూర్తి చేశారు. విద్యార్థి దశ నుంచీ కాంగ్రెస్ పార్టీలో పోరాట నాయకుడిగా పేరు పొందారు. 1978, 1983, 1985 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున శ్రీకాళహస్తి అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిచెందారు. 1985లో టీడీపీ తరఫున పోటీ చేసిన సత్రవాడ మునిరామయ్య ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆయన రైల్వే కాంట్రాక్టరుగా ఉంటూ శాసనసభకు ఎన్నిక కావడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. 1987లో సత్రవాడ మునిరామయ్య ఎన్నిక రద్దవడంతో 1988లో ఉప ఎన్నిక జరిగింది. ఆ ఎన్నికలో టీడీపీ అభ్యర్థి కొండుగారి శ్రీరామమూర్తిపై చెంచురెడ్డి 4,419 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. సుమారు 18నెలల పాటు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. సుదర్ఘీకాలం కాంగ్రెస్ పార్టీలో కొనసాగిన ఆయన 2019 ఎన్నికల ముందు వైసీపీలో చేరారు. ఇటీవల వయసు మీదపడటంతో అనారోగ్యానికి గురయ్యారు. తిరుపతిలో చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందారు. ఆయనకు భార్య సుభద్రమ్మ, కొడుకు మోహన్‌రెడ్డి, కుమార్తెలు చెంచులత, బాలమ్మ ఉన్నారు. బుధవారం ఇంటి వద్ద అంత్యక్రియలు జరిపేలా కుటుంబ సభ్యులు ప్రకటన విడుదల చేశారు. ఆయన మృతిపై కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్, సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, వైసీపీ నేత సిరాజ్‌బాషా, ముక్కంటి ఆలయ మాజీ పాలకమండలి మాజీ సభ్యుడు జయగోపాల్, రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం శ్రీకాళహస్తి యూనిట్ అధ్యక్షుబు వెంకయ్య, శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ సమన్వయకర్త దామోదర్‌రెడ్డి తదితరులు సంతాపం తెలిపారు.

మెగా డీఎస్సీ ఫలితాలొచ్చాయ్!

రెండు రోజుల పాటు అభ్యంతరాల స్వీకరణ

ఆపై కేటగిరి వారీగా తుది ఫలితాల వెల్లడి



చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):మెగా డీఎస్సీ ఫలితాలను రాష్ట్ర విద్యాశాఖ సోమవారం రాత్రి విడుదల చేసింది.ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే దాదాపు 1478 పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేసేందుకు జూన్ 5వ తేదీ నుంచి జూలై 3వ తేదీ వరకు చిత్తూరులో నాలుగు, చెన్నైలోని మరో నాలుగు సెంటర్లలో పరీక్షలు నిర్వహించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 1478 పోస్టులకు 26,501మంది అభ్యర్థులు 45,221 దరఖాస్తులు పంపారు. సకాలంలో ఫీజు చెల్లించకపోవడం, నమోదులో లోపాలు, అర్హత లేకపోవడం, ఇతరత్రా కారణాలతో 2701 దరఖాస్తులు తిరస్కరణకు గురికాగా 23,500 మంది అభ్యర్థులు తేలారు. పరీక్షలు దగ్గపడే సమయానికి మరిన్ని కారణాలతో 2160 మంది అభ్యర్థులు పరీక్షలకు దూరం కాగా, చివరకు 21,340 మంది అభ్యర్థులు పరీక్షలకు అర్హత సాధించారు. ఇదిలా ఉండగా జూలై 3వ తేదీ వరకు సాగిన డీఎస్సీ పరీక్షల్లో 19,550 మంది హాజరయ్యారు. ప్రతి పరీక్ష అనంతరం రెండు రోజుల్లో 'కీ'ని విడుదల చేయగా, ఏడు రోజుల అనంతరం ఫైనల్ 'కీ' విడుద చేశారు. ఈ ప్రక్రియ పూర్తి కావడంతో సోమవారం రాత్రి డీఎస్సీలో అభ్యర్థులు సాధించిన మార్కుల జాబితాను రాష్ట్ర విద్యాశాఖ విడుదల చేసింది. అభ్యర్థులకు వచ్చిన మార్కులపై అభ్యంతరాలు స్వీకరించేందుకు రెండు రోజులు గడువు ఇచ్చింది. ఈ ప్రక్రియ ముగియగానే కేటగిరి వారీగా మెగా డీఎస్సీ అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదల చేయనున్నారు.




విమానాశ్రయంలో నాదెండ్లకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే తదితరులు

చట్టం తన పని తాను చేసుకుపోతుంది

● వైసీపీ అరాచకాలపై మంత్రి నాదెండ్ల

రేణిగుంట, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసినట్లు.. ఇప్పుడూ అరాచకాలు చేయాలనుకుంటే చట్టం తన పని తాను చేసుకుపోతుందని రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. అన్నమయ్య జిల్లా కోడూరులో మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవానికి వెళ్లేందుకు ఆయన సోమవారం మధ్యాహ్నం తిరుపతి విమానాశ్రయం చేరుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, తిరుపతిలో వైసీపీ చేసిన అరాచకాలు ప్రజలందరికీ తెలుసన్నారు. దళిత యువకుడిపై దాడిని రాష్ట్రమంతా చూసిందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలపై తమ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, జనసేన నగర అధ్యక్షుడు రాజారెడ్డి తదితరులు మంత్రికి స్వాగతం పలికారు.

టీటీడీ ట్రస్టులకు రూ.30.1 లక్షల విరాళం



టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి విరాళం చెక్‌ను అందజేస్తున్న మోహన్ కుమార్ రెడ్డి

తిరుమల, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): టీటీడీ ట్రస్టులకు సోమవారం రూ.30.10 లక్షలు విరాళంగా అందాయి. బెంగళూరుకు చెందిన చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రెసిడెంట్ ఎస్ఎన్‌వీఎల్ నరసింహ రాజు తరఫున మోహన్ కుమార్ రెడ్డి తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి రూ.20 లక్షల విరాళం చెక్‌ను అందజేశారు. ఇందులో రూ.10 లక్షలు ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు, మరో రూ.10 లక్షలు ప్రాణదానం ట్రస్టుకు వినియోగించాలని దాత కోరారు. అలాగే ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు కడప జిల్లా సీఆర్ అసోసియేట్స్ సంస్థ అధినేత చరణ్‌తేజ్ రూ.10.10లక్షలు విరాళంగా అందజేశారు.

ఇటు రద్దీ.. అటు బోసిపోయి



శ్రీకాళహస్తిలో అర్జీదారులు

శ్రీకాళహస్తిలో ప్రత్యేక పీజీఆర్ఎస్‌కు ఎమ్మెల్యేతో పాటు కలెక్టరూ హాజరయ్యారు. దీంతో అక్కడ అర్జీదారుల రద్దీ ఎక్కువగా ఉంది. వీరంతా ఇటు రావడంతో కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్‌కు అర్జీదారుల తాకిడి తగ్గింది.



కలెక్టరేట్ వద్ద ఖాళీ కుర్చీలు

- 8లో

బాల పురస్కార్‌కు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): 2025 సంవత్సరానికిగాను కేంద్ర ప్రభుత్వం అందజేసే ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్ అవార్డు కోసం ఆసక్తి గలవారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ వసంతబాయి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదర్శప్రాయమైన పనులు, జాతీయస్థాయి క్రీడలు, సంఘసేవ, సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం, ఆర్ట్స్, లలిత కళలు.. ఇలా వివిధ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన 18ఏళ్ల లోపు పిల్లలు ఈ అవార్డులకు అర్హులని పేర్కొన్నారు. ఈనెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 83285 62595 నెంబరులో సంప్రదించాలని కోరారు.

స్కూల్ గేమ్స్ సెక్రటరీ నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2025-26 సంవత్సరానికిగాను స్కూల్ గేమ్స్ సెక్రటరీ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీఈవో కేవీఎస్ కుమార్ తెలిపారు. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో కనీసం పదేళ్ల సర్వీస్ ఉన్న పీఈటీలు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. పాఠశాల విద్యాశాఖ ఈనెల 8వ తేదీన విడుదల చేసిన నియమ నిబంధనలను అనుసరించి ప్రతిభ ఆధారంగా నియామక ప్రక్రియ ఉంటుందని, ఆసక్తి ఉన్నవారు ఈ నెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గడువు సమయం మించిన తర్వాత అందిన దరఖాస్తులను పరిగణనలోకి తీసుకునేది లేదని స్పష్టం చేశారు.

చంద్రగిరి

ఎమ్మెల్యే చొరవతో వర్షపునీరు తొలగింపునకు చర్యలు



రహదారిపై నిలిచిన వర్షపునీటి తరలింపుపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

తిరుపతి రూరల్, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): తనపల్లె సర్కిల్ నుంచి శ్రీనివాసపురం పంచాయతీ వైపు వెళ్లే మార్గంలో ఆదివారం రాత్రి వర్షపు నీరు భారీగా చేరింది. దీంతో వాహనదారులు, పాదాచారులు ఇబ్బంది పడ్డారు. ఎమ్మెల్యే పులివర్తి నాని తక్షణమే స్పందించి మండలస్థాయి అధికారులతో కలసి సోమవారం ఉదయం సందర్శించారు. వర్షపునీరు తొలగింపునకు వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రయాణికులకు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చూడాలని పోలీసులకు సూచించారు. తనపల్లె సర్కిల్ నుంచి మ్యాంగో మార్కెట్ వరకు సైడ్‌డ్రెయిన్స్ ఏర్పాటుపై ఆయన అధికారులతో మాట్లాడారు. ఎంపీడీవో రామచంద్ర, అధికారులు, టీడీపీ మండలపార్టీ అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, స్థానికనేతలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న ఎంపీపీ చంద్రమోహన్‌రెడ్డి

తిరుపతిరూరల్, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణని మెరుగుపరచి సీజనల్ వ్యాధులపై ప్రజలకు ముందస్తుగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని రూరల్‌మండల ఎంపీపీ చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలోని తన చాంబర్‌లో సోమవారం ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. పేడదిబ్బలు, ఇళ్లపరిసరాలు, తాగునీటి బోర్లు ఉన్న చోట నీరునిల్వ చేరకుండా జాగ్రత్తలు తీసుకునేలా కార్యదర్శులను అప్రమత్తం చేయాలన్నారు. చెత్త, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగింపునకు చర్యలు చేపట్టాలన్నారు. పేరూరు లేదా పుదిపట్ల పంచాయతీలో పీహెచ్‌సీ ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేయాలని కోరారు. వైస్‌ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, ఎంపీడీవో కె.రామచంద్ర, మంగళం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జయంతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హిమంత్‌కుమార్, దామినేడు ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి కుటుంబానికి పరామర్శ

చంద్రగిరి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అక్కగార్ల కాలనీకి చెందిన టీడీపీ నాయకుడు గురుమూర్తిరెడ్డి కుటుంబాన్ని సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే పులివర్తి నాని పరామర్శించారు. గురుమూర్తిరెడ్డి మాతృమూర్తి లక్ష్మమ్మ మృతి చెందింది. ఈసందర్భంగా ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. డీసీఎంఎస్ చైర్మన్ సుబ్రమణ్యంనాయుడు, ఏఎంసీ చైర్మన్ గౌస్‌బాషా, టీడీపీ నాయకులు పాల్గొన్నారు

హర్‌ఘర్ తిరంగాపై అవగాహనా ర్యాలీ



పాకాల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): అందరి ఇండ్లపై జాతీయ జెండా ఎగురవేయాలని తహశీల్దార్ సంతోష్‌సాయి, ఎంపీడీవో శశిరేఖ కోరారు. హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 15న గ్రామాల్లోని ప్రతి ఇంటిపై భారత జాతీయ త్రివర్ణ పతాకం ఎగురవెయ్యాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశించాయన్నారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి మండలంలోని వివిధ శాఖల అధికారులు సిబ్బంది సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ పి.హరినాథ ఆచారి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారి మునిరాజ, ఏటీఎం రామ్మోహన్, ఏపీవో ఆశారాణి, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామస్థులకు న్యాయ అవగాహన సదస్సు



సదస్సులో పాల్గొన్న న్యాయ విద్యార్థులు

చంద్రగిరి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): చిన్నరామాపురంలో ఎస్వీ యూనివర్శిటీ ఐదో సంవత్సర న్యాయవిద్యార్థుల ఆధ్వర్యంలో సోమవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. అందరికీ న్యాయపరమైన అవగాహన ఉండాలని, చట్టపరమైన జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని వారు సూచించారు. పంచాయతీ చట్టాలు, మహిళల హక్కులు, తప్పుడు కేసుల నమోదు ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన విధానాల గురించి సలహాలిచ్చారు. కార్యక్రమంలో లా విభాగం అధ్యాపకులు డాక్టర్ అమలేశ్వరి, సుధాకర్ పాల్గొన్నారు.

ముగిసిన సుదర్శన హోమం



రామచంద్రాపురం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): కమ్మకండ్రిగ హరిజనవాడలశ్రీకృష్ణ దేవాలయం వద్ద రెండు రోజులుగా నిర్వహించినసుదర్శన హోమం సోమవారం పూర్ణాహుతితో ముగిసింది. ఈ సందర్భంగా ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. కృష్ణస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం స్వామిని గరుడవాహనంపై ఊరేగించారు. అంతకుముందు గ్రామస్థులు పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఉభయదాత పాసర్ల కావ్య, వేణుగోపాల్‌నాయుడు దంపతులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దని సీపీఐ వినతి



విద్యుత్ అధికారులకు వినతిపత్రమిస్తున్న సీపీఐ నాయకులు

చంద్రగిరి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్ల యోచన విరమించుకోవాలని సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి శ్రీరాములు డిమాండ్ చేశారు. అలాగే ట్రూఆఫ్ చార్జీలను తగ్గించాలన్నారు. సీపీఐ పిలుపు మేరకు సోమవారం చంద్రగిరి విద్యుత్ అధికారులకు ఆ పార్టీ నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ కూటమి నాయకులు స్మార్ట్ మీటర్లు బిగించేదిలేదని, కరెంటు చార్జీలు పెంచబోమని ఎన్నికలలో హామీ ఇచ్చారన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై మోపుతున్న విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని లేనిపక్షంలో భవిష్యత్తు పోరాటాల సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కేవై రాజా, మునురత్నం నాయుడు, వాణి, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మానవహారం



భాకరాపేట, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఎందరో మహనీయులు త్యాగఫలితంగా స్వాతంత్రం సిద్ధించిందని ఎంపీడీవో గిడ్డయ్య అన్నారు. చిన్నగొట్టిగల్లులో సోమవారం విద్యార్థులతో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించాక మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్రయోధుల త్యాగనిరతిని స్మరించుకోవాలన్నారు. 15వ తేదీ వరకు హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించాలన్నారు. తహసీల్దారు భాగ్యలక్ష్మి, డిప్యూటీ ఎంపీడీవో సోమశేఖర రెడ్డి, స్వచ్ఛ భారత్ కో-ఆర్డినేటర్ గిరిబాబు, కార్యదర్శులు పాల్గొన్నారు.

16న గోకులాష్టమి వేడుకలు

తిరుచానూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారి ఆలయానికి అనుబంధంగా ఉన్న కృష్ణస్వామి ఆలయంలో ఈనెల 16న గోకులాష్టమి వేడుక జరగనుంది. టీటీడీ ఆధ్వర్యంలో ఆరోజు ఉదయం స్వామివారి మూలవర్లకు అభిషేకం, మధ్యాహ్నం తిరుమంజనం చేస్తారు. రాత్రి 7గంటలకు స్వామివారు పెద్ద శేషవాహనంపై తిరుమాడ వీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమివ్వనున్నారు. గోపూజ, గోకులాష్టమి ఆస్థానం జరగనుంది. 17న ఉట్లోత్సవం సందర్భంగా స్వామివారికి స్నపనతిరుమంజనం, ఒజల్‌సేవ చేస్తారు. సాయంత్రం ఉట్లోత్సవం, ఆస్థానం నిర్వహిస్తారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

పెళ్లకూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగలను కర్రతో కదిలించే క్రమంలో విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం సాయంత్రం మండల కేంద్రమైన పెళ్లకూరులో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు... గ్రామా నికి చెందిన మెరిమి సుధాకర్(29) ఇంట్లోకి విద్యుత్ సరఫరా సక్ర మంగా రాకపోవడంతో కర్రతో స్థంభానికి ఉన్న వైర్లను కదిలించాడు. ఈ క్రమంలో విద్యుదాఘాతం జరగడంతో సుధాకర్ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోగా, వెంటనే శ్రీకాళహస్తి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ ఢీకొని తమిళనాడువాసి...

తడ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని బైక్ ఢీకొని తమిళనాడు వవాసి మృతి చెందాడు. తమిళనాడులోని మాదరపాకం తాలుక అప్పాయిపాలెం గ్రామానికి చెందిన వీరయ్య(59) సోమ వారం తడకు వచ్చాడు. తిరిగి వెళుతుండగా స్థానిక భారత్ పెట్రోల్ బంకు ఎదురుగా రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని బైక్ వేగంగా వీరయ్యను ఢీకొంది. 108 వాహనంలో సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రమాదానికి కారణమైన మోటారు సైకిలిస్టు పరారయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం



అగ్నిప్రమాదానికి గురైన దుకాణం

గూడూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆస్పత్రి రోడ్డులోని ఓ ఎలక్ట్రానిక్స్ దుకాణంలో సోమవారం షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. ఇన్‌చార్జి అగ్నిమాపకశాఖ అధికారి విజయ్‌కుమార్ వివరాల మేరకు... స్థానిక ఆస్పత్రి రోడ్డులోని ఓ ఎలక్ట్రానిక్స్ దుకాణంలో షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించ డంతో సిబ్బంది అగ్నిమాపకశాఖకు సమాచారం అందించారు. అగ్నిమాపకశాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.5లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు ఆయన తెలిపారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఫాతిమా



ఏర్పేడు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఎస్‌కే ఫాతిమా జాతీయ స్థాయిలో సెప్టెంబరులో గోవాలో జరగనున్న అథ్లెటిక్స్ పోటీలకు పోటీలకు ఎంపికైంది. బీఏ చదువుతున్న ఫాతిమా తిరుపతి జిల్లా తరఫున బాపట్ల జిల్లా చీరాలలో ఈనెల 9, 10, 11 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌లో డిస్కస్‌త్రోలో ప్రథమ స్థానంలో, షాట్‌పుట్‌లో ద్వితీయ స్థానంలో నిలిచింది. పీడీ శివకుమార, తిరుపతి, చిత్తూరు జిల్లాల ఒలంపిక్ అసోసియే షన్ జనరల్ సెక్రటరీ రోబో ఆమెను అభినందించారు.

ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించండి



తిరుపతి (నేరవిభాగం), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులు, భక్తులతో మర్యాదగా ప్రవర్తించాలని ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణచారి, సీఐ సంజీవ కుమార్ సూచించారు. రైల్వే స్టేషన్ వద్ద భక్తులకు.. ఆటో యూనియన్, డ్రైవర్ల మధ్య జరిగిన గొడవ నేపథ్యంలో ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం సమావేశం నిర్వహించారు. ఎవరైనా యాత్రికులకు ఇబ్బంది కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నో పార్కింగ్ జోన్లలో ఆటోలు నిలపొద్దని, ఆటోలకు మీటరు బిగించుకోవాలని సూచించారు. అధిక శబ్దం చేసే హారన్లు వాడరాదన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించొద్దని స్పష్టంచేశారు.

సిబ్బంది కొరతతో సతమతం

- చంద్రగిరి పోలీస్ స్టేషన్‌లో ఇబ్బందులు



చంద్రగిరి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది కొరత తీరడం లేదు. అప్ గ్రేడ్ చేసినా ఈ స్టేషన్‌లో తగినంత మందిని నియమించడంలేదు. సీఐ, ఇద్దరు ఎస్ఐలు, 4 ఏఎస్ఐలు, 9 మంది హెడ్ కానిస్టేబుల్స్, 40 మంది కానిస్టేబుల్స్‌తో మొత్తం 56 మంది ఉండాలి. ప్రస్తుతం ఇన్‌చార్జ్ సీఐ, ఇద్దరు ఎస్ఐలు, నలుగురు ఏఎస్ఐలు, ఏడుగురుహెడ్ కానిస్టేబుళ్లు, 18 కానిస్టేబుళ్లు ఉన్నారు. ఇందులో రక్షక్ వాహనం, బ్లూకోర్టు విధులకు, ఆర్ఎస్ హైవే మొబైల్ వాహనం విధులకు ఆరుగురు కానిస్టేబుళ్లతో పాటు, నలుగురు హోమ్ గార్డులు ఉండాలి. మరో 15మందిని కోర్టు లాంటి వివిధ విధులకు కేటాయిస్తుంటారు. దీంతో కొద్దిమంది కానిస్టేబుళ్లే స్టేషన్లో మిగులుతున్నారు.

పని ఒత్తిడి.. హెచ్‌ఆర్ తక్కువ

పని ఒత్తిడి అధికంగా ఉండటం, హెచ్‌ఆర్‌ఏ 10 శాతం మాత్రమే ఇవ్వడం, రాజకీయ వివాదాలు నేపథ్యంలో ఇక్కడ పనిచేయడానికి సిబ్బంది ఆసక్తి చూపడం లేదు. తిరుపతికి 12 కిలోమీటర్ల దూరం ఉండటంతో చంద్రగిరి స్టేషన్ సిబ్బందికి హెచ్‌ఆర్‌ఏ 10 శాతం మాత్రమే వర్తిస్తోంది. రామచంద్రాపురం స్టేషన్, కల్యాణీ డ్యామ్ పోలీస్ ట్రైనింగ్ కళాశాల సిబ్బందికి 16 శాతం ఇస్తున్నారని సిబ్బంది చెబుతున్నారు. దీంతో ఇక్కడికి రావడానికి పోలీస్ సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ఈ స్టేషనుకు సరిపడా సిబ్బందిని నియమించాలని, హెచ్‌ఆర్‌ఏను 16 శాతానికి పెంచాలని సిబ్బంది కోరుతున్నారు. మండలంలోని రెండు జాతీయ రహదారుల్లో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయి. మండల గ్రామీణ ప్రాంతాల్లో చోరీలు కూడా ఎక్కువగానే జరుగుతున్నాయి. తిరుపతికి ప్రముఖులు వచ్చే క్రమంలో బందోబస్తుకు ఇక్కడి సిబ్బందిని పంపుతున్నారు. అప్పుడు స్టేషన్లో ఒక్కరు మాత్రమే ఉంటున్నారు. 40 రోజుల క్రితం ఇక్కడి సీఐ సుబ్బరామిరెడ్డి తిరుపతి ట్రాఫిక్‌కు బదిలీ అయ్యారు. అప్పటి నుంచి భాకరాపేట సీఐ ఇన్‌చార్జ్‌గా ఉన్నారు.

వైసీపీ హయాంలో స్వార్థ రాజకీయాలతో అభివృద్ధికి గండి: నాని



అర్జీదారుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

చంద్రగిరి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): గత పాలకుల స్వార్థ రాజకీయాలతోనే చంద్రగిరి మండలంలో అభివృద్ధి జరగలేదని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. సోమవారం పనపాకం పంచాయతీలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వార్థ రాజకీయాలతో ఈ మండలం ప్రగతికి దూరమైందన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే హామీలను అమలు చేసుకుంటూ వెళ్తోందన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో సుమారు 600 కుట్టు మిషన్లను అందజేసి మహిళలకు స్వయం ఉపాధి కల్పించమన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో 4504 రైతులకు సుమారు రూ.2.94 కోట్లు ఖాతాలో జమ అయిందన్నారు. అనంతరం పనపాకం పంచాయతీలోని సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అర్జీలను స్వీకరించారు. డీసీఎంఎస్ చైర్మన్ పల్లినేని సుబ్రమణ్యంనాయుడు, ఎంపీడీవో వెంకటరత్నం, తహసీల్దార్ శివరామసుబ్బయ్య, ఏఎంసీ చైర్మన్ గౌస్‌బాషా, బాలకృష్ణమూర్తి, టీడీపీ నాయకులు మేడసాని కుమార్, నగరం రమేష్, లోకాద్రి, మదివట్ల రమణ, ఆవులపాటి ప్రభాకర్, గంగాధరం, చెంగల్రాయులు, గురుస్వామి పాల్గొన్నారు.

ఈదారిలో ప్రయాణించేదెలా..!



ఆర్సీపురానికి వెళ్లే మార్గంలో నిలిచిన వర్షపునీరు,

తిరుపతిరూరల్, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): ఆర్సీపురానికి వెళ్లే మార్గంలో చినుకుపడితే నీరు పలు చోట్ల రోడ్డుపక్కనే చేరుతోంది. దీంతో వాహనదారులు, పాదాచారులు ఇబ్బందిపడుతున్నారు. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి పీసీఆర్‌బార్ ఎదురుగా రోడ్డుపై నీరు నిల్వచేరి చెరువును తలపిస్తోంది. బార్ ప్రాంగణంలోని టాయిలెట్ల నుంచి డ్రైనేజీనీరు బయటకు పంపేందుకు నిర్వాహకులు రోడుకు ఆనుకుని సెప్టిక్‌ట్యాంక్‌ని ఏర్పాటు చేసుకున్నారు. వర్షపునీరు ట్యాంక్‌లోకి చేరి నిండిపోయింది. మురుగునీరుతో కలసి రోడ్డుపైకి చేరింది. ఈమార్గంలో దుర్వాసన వెదజల్లుతోంది. ముక్కు మూసుకుని వెళుతున్నారు. వేగంగా ప్రయాణించే వాహనాల నుంచి నిల్వనీరు పాదాచారులపై చిమ్ముతుండలతో ఇబ్బందిపడుతున్నారు. ఈమార్గంలో పల్లపుప్రాంతం ఉన్న చోట్ల రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు.

గోడు వినిపించిన అర్జీదారులు

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పలువురు తమ గోడు వినిపించారు. తమ విన్నపాలను అధికారులకు అందజేశారు. జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, ఇతర అధికారులు వినతులు స్వీకరించారు.

పింఛను కోసం..



అయ్యా.. నేను సెలూన్ షాపులో పని చేస్తూ జీవనం సాగించేవాడిని. షుగర్ కారణంగా కుడికాలికి ఇన్‌ఫెక్షన్ సోకి గత ఏడాది పూర్తిగా తొలగించారు. అప్పటి నుంచి నడవలేని పరిస్థితి. కుటుంబ పోషణ కష్టంగా ఉంది. వికలత్వ పింఛను ఇప్పించి ఆదుకోండి.

- లక్ష్మయ్య, గంగిరెడ్డివల్లె, ఆర్సీపురం

డ్రైనేజీపై ఇల్లు కడుతున్నారు..



తిరుచానూరు ఏడవ వార్డు శ్రీహరికొలువు కొత్తవీధిలో డ్రైనేజీ కాలువపై ఏలుమలై రెడ్డి ఇల్లు నిర్మిస్తున్నాడు. ప్రశ్నిస్తే సరిగా సమాధానం చెప్పడం లేదు. ఈ ఇంటి నిర్మాణం పూర్తయితే ప్రజలకు ఇబ్బందిగా మారుతుంది. దయవుంచి చర్యలు తీసుకోండి.

- ఆనంద్, తిరుచానూరు

పోలీసు పీజీఆర్‌ఎస్‌కు 88 వినతులు



అర్జీదారుతో మాట్లాడుతున్న హర్షవర్ధనరాజు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 88 వినతులు వచ్చాయి. ఇందులో భూ, ఆర్థిక పరమైన సమస్యలు, భార్యాభర్తల తగాదాలు, చోరీలు, చీటింగ్ కేసులు, దొంగ రిజిస్ట్రేషన్లు తదితరాలు ఉన్నాయి. కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన వాటిని అధికారులకు పంపి పరిష్కరించాలని ఆదేశించారు. అదనపు ఎస్పీలు రవిమనోహరాచారి, నాగభూషణరావు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

బీజేపీ సారథ్య సభను విజయవంతం చేద్దాం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సామంచి

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పాల్గొననున్న సారథ్య సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ కోరారు. ఓ హోటల్లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పీవీఎన్ మాధవ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సారథ్యం పేరుతో రాష్ట్ర పర్యటన ప్రారంభించారని చెప్పారు. రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేయడంలో భాగంగా మంగళవారం తిరుపతిలో నిర్వహించే సభలో మాధవ్ పాల్గొంటారని వివరించారు. ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు ప్రతి కార్యకర్తా తరలిరావాలని కోరారు. కోలా ఆనంద మాట్లాడుతూ మాధవ్ సారథ్యంలో జిల్లాలో పార్టీ విస్తరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు పెద్దయెత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. పార్టీ జిల్లా కార్యదర్శులు నరేష్ బాలాజీ, జల్లి మధుసూదన్, అజయ్ కుమార్, వరప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్‌సీపురంలో భారీ వర్షం

రామచంద్రాపురం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మూడు రోజులుగా వర్షం కురుస్తుండటంతో చిన్నపాటి వ్యాపారస్థులు ఇబ్బందులు ఎదురయ్యాయి. వ్యవసాయ పనులు కూడా ఎక్కడికక్కడ ఆగిపోయాయి. చెరకుతోటలు, వేరుశనగ పంటలకు మేలుచేకూరింది. చిన్నపాటి కాలువలు ప్రవమిస్తున్నాయి.

వేదోక్తంగా మృత్యుంజయస్వామికి పూజలు



శ్రీకాళహస్తి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాల యంలో కొలువై ఉన్న మృత్యుంజయస్వామికి సోమవారాన్ని పురస్కరించుకుని వేదోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా వినా యకుడికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి కర్పూర హారతులు ఇచ్చారు. అనంతరం మృత్యుంజయుడిని పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంతో అభిషేకించారు. అనంతరం గజమాల, వెండి నాగాభరణంతో అలంకరించి దర్శనభాగ్యం కల్పించారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్టు

తిరుపతి (నేరవిభాగం), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతి వెస్ట్ పోలీసు స్టేషన్ పరిధిలో 17 ఏళ్ల బాలికను తీసుకెళ్లి, మభ్యపెట్టి అత్యాచారానికి పాల్పడిన మెకానిక్ ఉమేష్‌ను పోక్సో చట్టం కింద పోలీసులు అరెస్టు చేశారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు తొలుత మిస్సింగ్ కేసు నమోదు చేసిన వెస్ట్ పోలీసులు.. కేసు దర్యాప్తు నేపథ్యంలో అత్యాచారం కేసుగా మార్చి నిందితుడిపై పోక్సో కేసు పెట్టారు. వేద వర్సిటీ సమీపంలో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన వెస్ట్ సీఐ మురళీమోహన్ రావు తెలిపారు.

రైల్వే స్టేషన్ ముందు అక్రమ ఆటో స్టాండు తొలగించండి



కమిషనరుకు వినతిపత్రం అందజేస్తూ...

తిరుపతి (నేరవిభాగం), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వే స్టేషన్ ముందు అక్రమంగా ఉన్న ఆటో స్టాండును తొలగించాలని పలువురు డిమాండు చేశారు. ఈ మేరకు శ్రీనివాసానంద సరస్వతి, శివానంద స్వామి, తిరుక్షేత్రాల రక్షణ సమితి అధ్యక్షుడు తుమ్మా ఓంకార్, అట్లూరి నారాయణరావు, నీలకంఠ, జెన్ కిరణ్, రెడ్డి శేఖర్ రాయల్, బానోతు శంకర్‌నాయక్, ఢిల్లీ, అశోక్ తదితరులు సోమవారం ఎస్పీ హర్షవర్ధనరాజుకు, కమిషనరు మౌర్యకు ఫిర్యాదు చేశారు. ఫుట్‌పాత్ లేకుండా చేసి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నారన్నారు. ఆటోస్టాండు ముసుగులో కొందరి రౌడీయిజంతో భక్తులకు రక్షణ లేకుండా పోతోందంటూ ఇటీవల భక్తులపై దాడిని ప్రస్తావించి ఆందోళన వ్యక్తంచేశారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

కేవీబీపురం, ఆగస్టు 11(ఆంధ్ర జ్యోతి): కొత్త చట్టాలపై అవగాహన కల్పించే విధంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని ఎస్పీ హర్షవర్ధన రాజు ఆదేశించారు. పుత్తూరు సబ్ డివిజన్‌లో కేవీబీ పురం పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ సోమవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు

వాహనం ఢీకొని కానిస్టేబుల్ దుర్మరణం



అయ్యప్ప (ఫైల్‌ఫొటో)



అయ్యప్ప మృతదేహానికి గౌరవ వందనం చేస్తున్న తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

వెదురుకుప్పం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వాహనం ఢీకొన్న ఘటనలో ఓ కానిస్టేబుల్ దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కార్వేటినగరం బీసీ కాలనీకి చెందిన వై.అయ్యప్ప (42) తిరుపతి జిల్లా పుత్తూరు టౌన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి పుత్తూరు నుంచి భార్యకు ఫోన్‌చేసి తమిళనాడులోని పళ్లిపట్టుకు కేసు పనినిమిత్తం వెళుతున్నట్లు చెప్పాడు. పుత్తూరు-చిత్తూరు జాతీయ రహదారిలో బైక్‌లో వస్తుండగా కార్వేటినగరం మండలం సురేంద్రనగరం క్రాస్‌రోడ్డు దాటాక వచ్చే కనుమ వద్ద ఆదివారం రాత్రి 9.30 గంటలప్పైన ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిర్వహించాక సోమవారం బంధువులకు మృతదేహాన్ని అప్పగించారు. వారు కార్వేటినగరానికి మృతదేహాన్ని తీసుకొచ్చారు. పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

కుటుంబాన్ని ఆదుకుంటాం: తిరుపతి ఎస్పీ

కానిస్టేబుల్ అయ్యప్ప కుటుంబాన్ని ఆదుకుంటామని తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. సోమవారం కార్వేటినగరానికి వచ్చిన ఆయన అయ్యప్ప మృతదేహాన్ని సందర్శించి, పూలమాల వేసి నివాళులర్పించారు. పోలీసుశాఖ తరఫున మృతుడి కుటుంబానికి రూ.లక్ష అందజేశారు. నివాళులర్పించిన వారిలో డీఎస్పీలు రవికుమార్, నగరి డీఎస్పీ అజీజ్, సీఐ హనుమంతప్ప ఉన్నారు.

చదువుకున్న విలువలను ఆచరించాలి

- టీటీడీ డీఈవో వెంకటసునీల్
- ఘనంగా పద్మావతి డిగ్రీ కాలేజీ 74వ వార్షికోత్సవం



సభలో ప్రసంగిస్తున్న టీటీడీ డీఈవో వెంకట సునీల్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తరగతి గదిలో చదువుకున్న విలువలను జీవితంలో ఆచరించాలని టీటీడీ డీఈవో వెంకటసునీల్ కోరారు. పద్మావతి డిగ్రీ కాలేజీ 74వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మార్కుల కోసం చదవకుండా మంచి ప్రవర్తనతో మెలగాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత అధ్యాపకులదేనని తెలిపారు. చదువుతోపాటు మంచి అలవాట్లు, మానవీయ విలువలు, ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ నారాయణమ్మ మాట్లాడుతూ ఈ కాలేజీలో చదువుకున్న ఎంతో మంది దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారని తెలిపారు. అంకిత భావంతో శ్రద్ధగా చదువుకుంటే మంచి భవిష్యత్తు కలుగుతుందన్నారు. రిటైర్డు ప్రిన్సిపాల్ స్వరాజ్యలక్ష్మి మాట్లాడారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో రిటైర్డు అధ్యాపకులు రుక్మిణమ్మ, నిగర్ సుల్తానా, కాలేజీ మీడియా కో-ఆర్డినేటర్ వి.కృష్ణవేణి పాల్గొన్నారు.

నేడు ఎస్వీయూలో అంతర్జాతీయ యువజన దినోత్సవం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీలో మంగళవారం అంతర్జాతీయ యువజన దినోత్సవం నిర్వహించనున్నారు. స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ - సెట్విన్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నాయి. ఉదయం 10 గంటలకు సెనెట్ హాల్లో ప్రారంభం కానుంది. ఇందులో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, శాప్ ఛైర్మన్ రవినాయుడు, వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, సీడీసీ డీన్ చెంద్రాయుడు, ప్రిన్సిపాల్ సుధారాణి, స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్ మురళీధర్, సెట్విన్ సీఈవో మోహన్‌కుమార్ పాల్గొంటారు. విద్యార్థులు హాజరుకావాలని వర్సిటీ కల్చరల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి కోరారు.

హర్‌ఘర్ తిరంగా ర్యాలీని విజయవంతం చేయండి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా అధికార యంత్రాంగం తిరుపతిలో చేపడుతున్న హర్‌ఘర్ తిరంగా ర్యాలీని జయప్రదం చేయాలని ఎస్వీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ భూపతి నాయుడు కోరారు. యూనివర్సిటీ విద్యార్థులు, ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని సోమవారం ఉత్తర్వులు వెలువరించారు. వైట్ అండ్ వైట్ ధరించి ఉదయం 6:30 గంటలకు మహతి ఆడిటోరియం వద్దకు చేరుకోవాలన్నారు. జాతీయ పతాకాన్ని చేబూని జాతీయ సమైక్యతను చాటి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. పాల్గొనే వారు సమాచారం కోసం కల్చరల్ కో-ఆర్డినేటర్ వివేక్‌ను 8500960162లో సంప్రదించాలని కోరారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో నలుగురికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో నలుగురికి జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగవ అదనపు న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పు చెప్పారు. ఒక్కొక్కరికి రూ.10వేలు వంతున 40వేలు జరిమానా విధించారు.

వర్షపు నీరు రోడ్లపైకి రాకుండా చర్యలు

తిరుపతి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి) : వర్షాలు కురుస్తున్న తరుణంలో నగరంలో ఎక్కడా నీరు రోడ్లపైకి రాకుండా చర్యలు చేపట్టాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం ఆమె నగరంలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ కాలువలు, లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కాలువల్లో పేరుకుపోయిన చెత్త, మట్టి తొలగించి నీరు సజావుగా వెళ్లేలా చూడాలన్నారు. పారిశుధ్య పనులు మెరుగ్గా చేపట్టాలని ఆదేశించారు. దోమలు వృద్ధి చెందకుండా ఫాగింగ్ చేయాలన్నారు. లక్ష్మీపురం వద్ద ఏర్పాటు చేయనున్న కూడలి వివరాలను స్మార్ట్ సిటీ ఈఈ రవి కమిషనర్‌కు వివరించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మున్సిపల్ ఇంజినీర్ తులసికుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డీఈలు రాజు, లలిత, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య ఉన్నారు.

విద్యార్థినితో అసభ్య ప్రవర్తన

- దేహశుద్ధి చేసిన స్థానికులు



తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఆటోడ్రైవర్, మరో యువకుడికి స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన కేటీ రోడ్డులోని పాలిటెక్నిక్ కళాశాల వద్ద సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. పాలిటెక్నిక్ చదువుతున్న విద్యార్థిని కాలేజీకి వెళ్లేటప్పుడు, తిరిగి వచ్చే సమయంలో ఆ ఇద్దరూ రోడ్డుపై కాపుకాసి అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం తన ఆటో ఎక్కాలని బలవంతం చేశారు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు ఆ ఇద్దరినీ పట్టుకుని దేహశుద్ధి చేశారు. ఆ విద్యార్థినితో చెప్పుతో కొట్టించి, పోలీసులకు అప్పగించారు. దీనిపై వెస్ట్ సీఐ మురళీమోహన్‌ను సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదూ అందలేదని చెప్పారు.

వైసీపీ చెత్త రాజకీయాలపై కార్పొరేషన్ ఆగ్రహం

తిరుపతి, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో చెత్త కుప్పలు పేరుకుపోయాయని వైసీపీ నీచ రాజకీయాలు చేస్తోందని మున్సిపల్ కార్పొరేషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. సోమవారం జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఇటీవల వైసీపీ నాయకులు భూమన అభినయ్ నగరంలోని సుందరయ్యనగర్ వద్దగల ఓ చెత్త కుప్ప చెంతకు చేరుకుని రాజకీయాలు చేయడాన్ని తీవ్రంగా ఖండించింది. తొలుత డిప్యూటీ మేయర్లు ఆర్సీ మునికృష్ణ, ముద్ర నారాయణ మాట్లాడుతూ అక్కడ చెత్తకుప్ప ఎందుకు ఉంటుందో, ఎంతసేపు ఉంటుందో కూడా తెలియకుండా వైసీపీ నాయకులు రాజకీయం చేస్తుంటే మున్సిపల్ అధికారులు వివరణ ఇవ్వకుండా మౌనంగా ఉండటమేమిటని ప్రశ్నించారు. దీనిపై వివరణ ఇవ్వాలని కమిషనర్ మౌర్య హెల్త్ ఆఫీసర్‌ను ఆదేశించారు. ఆ మేరకు హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ వైసీపీ నాయకుల చర్యలను తప్పుబడుతూ ఫొటోలతో కూడిన ప్రకటన విడుదల చేశారు. సుందరయ్యనగర్, మధురానగర్‌లో ప్రతిరోజూ పారిశుధ్య కార్మికులు చెత్త సేకరించి దోబీఘాట్ వద్ద పుష్‌కార్ట్‌లో ఉంచి రాత్రి, తెల్లవారుజామున శుభ్రం చేస్తారన్నారు. గత శుక్రవారం వరలక్ష్మీవ్రతం సందర్భంగా చెత్త రోజువారీకన్నా ఎక్కువగా వచ్చిందని, దాన్ని సేకరించేలోపు వైసీపీ నాయకులు చెత్త తీయడంలేదని చెప్పడం సరైంది కాదని పేర్కొన్నారు.

ఆర్ఎంపీ క్లినిక్ సీజ్



డక్కిలి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): డక్కిలిలో ప్రభుత్వాస్పత్రి ఎదురుగా నడుపుతున్న ఆర్ఎంపీ క్లినిక్‌ను సోమవారం అధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యాధికారిణి బిందుప్రియ మాట్లాడుతూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల ఆదేశాల మేరకు ఏప్రిల్‌లోనే ఆర్ఎంపీ క్లినిక్‌ను సీజ్ చేశామన్నారు. అయితే హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు కావడంతో తదుపరి చర్యలు తీసుకోలేదన్నారు. హైకోర్టు ఆ కేసు కొట్టివేయడంతో ఈనెల 7న క్లినిక్ నిర్వాహకులకు నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. గడువు ముగిసినా నిబంధనలు పాటించకపోవడంతో సోమవారం క్లినిక్‌ను మూసివేయించినట్లు వివరించారు. కార్యక్రమంలో వెంకటగిరి సీఐ రమణ, డక్కిలి, బాలాయపల్లి ఎస్ఐలు శివశంకర్, కామినేని గోపి, వైద్యాధికారి శ్రీహరి, డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్నరాణి తదితరులు పాల్గొన్నారు.

పొంచివున్న ప్రమాదం

తిరునగరిలో కూలడానికి సిద్ధంగా ఉన్న వృక్షాలు



ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వద్ద ఎండిపోయి కూలడానికి సిద్ధంగా ఉన్న చెట్టు



చెన్నారెడ్డికాలనీలో ప్రమాదకరంగా ఉన్న చెట్లు



తిరుమల బైపాస్‌లో వంగివున్న చెట్టు

తిరుపతి అర్బన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు భారీ వృక్షాలు ప్రమాదకరంగా మారాయి. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో భూమి బాగా నాని ఆకస్మాత్తుగా చెట్లు నేలకూలుతున్నాయి. ఆదివారం రాత్రి ఖాదీకాలనీలో ఓ భారీ వేప చెట్టు కుప్పకూలింది. ఆ సమయంలో వర్షం కురుస్తుండటం, జన సంచారం లేక పోవడంతో ప్రమాదం తప్పింది. ఈ తరహా వృక్షాలు నగరంలో అనేకమున్నాయి. కొన్ని పూర్తిగా ఎండిపోగా, మరికొన్ని కొన ఊపిరితో పచ్చగా ఉంటున్నాయి. గాలివాన బీభత్సం సృష్టిస్తే కూలిపోయే అవకాశాలు ఉన్నాయి. వాతావరణ శాఖ తుపాను హెచ్చరికలు చేసిన నేపథ్యంలో నగరపాలక సంస్థ స్పందించి ప్రమాదకరంగా ఉన్న వృక్షాలను తొలగించడమో లేదా కొమ్మలు కత్తిరించడమో చేయాల్సిన అవసరముంది.

నగరపాలక సంస్థ పీజీఆర్ఎస్‌కు 38 వినతులు



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పాటకం వెంకటేష్ తదితరులు

తిరుపతి, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి) : తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 38 వినతులు వచ్చాయని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్సీ మునికృష్ణ, కార్పొరేటర్లు నరసింహాచారి, నరేంద్ర, శైలజలు తమ డివిజన్లలో సమస్యలను పరిష్కరించాలని కోరారు. కనక భూషణ్ లేఅవుట్‌లో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, గొల్లవానిగుంటలో డ్రైనేజీ బాగు చేయాలని, రోడ్లు వేయాలని, రాయలవారి వీధిలో డ్రైనేజీ నీరు వెళ్లడం లేదని, వరదరాజనగర్‌లో చెత్త వేస్తున్నారని, చెట్ల కొమ్మలు తొలగించాలని వినతులు వచ్చాయి. సుబ్బారెడ్డినగర్ రెండవ లైన్‌లో రోడ్డు మరమ్మతు చేయాలని, జబ్బార్ లే అవుట్‌లో పార్కు ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారని, బైరాగి పట్టెడలోని కాలు వల్లో మురుగు తొలగించాలని కోరారు. అలాగే కేశవాయనగుంట, లక్ష్మీపురం కూడలికి సంబంధించి సమస్యలు వచ్చాయని, వెంటనే పరిష్కరించాలని ఆదేశించామని కమిషనర్ తెలిపారు. కేశవాయన గుంటలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై టీడీపీ నేత పాటకం వెంకటేష్ ఆధ్వర్యంలో కమిషనర్ మౌర్యను కలిసి వినతిపత్రం అందజేశారు.

చేనేత వస్త్రాలను ఆదరించండి



చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న వీసీ ఉమ తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మన సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా ఉన్న చేనేత వస్త్రాలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని పద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీ వెన్నం ఉమ కోరారు. ప్రధానమంత్రి ఉచ్చతర్ శిక్ష అభియాన్ (పీఎం-ఉష) సౌజన్యంతో సెరికల్చర్ విభాగం చేపట్టిన వెంకటగిరి హ్యాండ్లూమ్ వీవ్స్ అంశంపై వర్క్‌షాప్‌లో సోమవారం ఆమె పాల్గొని మాట్లాడారు. చేనేత రంగానికి చాలా ప్రాముఖ్యత ఉందని, ఇది మన సంప్రదాయానికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రతినెలా ఏడో తేదీ యూనివర్సిటీ ఉద్యోగులు చేనేత వస్త్రాలు ధరించాలని కోరారు. చేనేత సామాజిక నేపథ్యం గల విద్యార్థినులకు యూనివర్సిటీలో ఉన్నత విద్యకు ప్రోత్సాహం అందిస్తామన్నారు. ఏపీ పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ రామదాసు గంగాధర్ మాట్లాడుతూ ఎంతో కళా నైపుణ్యం ఉన్నప్పటికీ ఆధునిక డిజైన్లు, యంత్రాల ఆధిపత్యం, మార్కెట్ పోటీతో చేనేత కార్మికులు ఇబ్బంది పడుతున్నారని, అయినా ప్రభుత్వ ప్రోత్సాహంతో ముందు కెళుతున్నారని తెలిపారు. రిజిస్ట్రార్ ఎస్.రజని, చేనేత, జౌళి శాఖ జిల్లా అధికారి రాచపూటి రమేష్ మాట్లాడుతూ చేనేత వస్త్రాలను అందరూ ధరించి, ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ పీఎం-ఉష కో-ఆర్డినేటర్ వాణి, వర్క్‌షాప్ కో-ఆర్డినేటర్ సావిత్రి, పీఆర్వో డాక్టర్ శ్రీరజని పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాల నిరసన

నిషేధం ఉత్తర్వులు రద్దు చేయాలని

- విద్యాశాఖ మంత్రి దిష్టిబొమ్మ దహనానికి యత్నం
- అడ్డుకున్న పోలీసులు
- ఇరువర్గాల మధ్య తోపులాట



విద్యార్థి నేతలకు, పోలీసులకు వాగ్వాదం

తిరుపతి(విద్య), ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): విద్యాలయాల ఆవరణలోకి అనధికారిక వ్యక్తులు, సంఘాలు ప్రవేశించరాదంటూ జారీ చేసిన ఉత్తర్వును రద్దు చేయాలని కోరుతూ పలు విద్యార్థి సంఘాలు సోమవారం స్థానిక టౌన్‌క్లబ్ కూడలిలో నిరసన ప్రదర్శన నిర్వహించాయి. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు యత్నించారు. పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, విద్యార్థి సంఘాల నాయకుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. అనంతరం విద్యార్థి నాయకులు ఎన్టీఆర్ విగ్రహం వద్ద బైఠాయించి నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భగత్ రవి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున, పీడీఎస్‌వో స్రవంతి మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నపుడు నేటి విద్యా శాఖ మంత్రి లోకేశ్ విద్యార్థుల సమస్యలన్నీ పరిష్కరిస్తానని, విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తానని నమ్మబలికారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోగా వాటిపై పోరాటం చేసే విద్యార్థి సంఘాలను కట్టడి చేసేలా ఉత్తర్వులు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. పైగా పోలీసులతో దాడి చేయించడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అక్బర్, వినోద్, అశోక్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉదయ్ కుమార్, విష్ణు, వినయ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు శివబాలాజీ, కార్యదర్శి కుమార్, నల్సా రాష్ట్ర అధ్యక్షుడు సుందర్ తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న మునిరాజమ్మ

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): తాము కొనుగోలు చేసిన భూమిలో నిర్మాణాలు చేయకుండా కొందరు అడ్డుపడుతున్నారని, వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని తిరుపతికి చెందిన మునిరాజమ్మ కోరింది. ప్రెస్‌క్లబ్‌లో ఆమె సోమవారం మాట్లాడుతూ తిరుచానూరు సమీపంలోని మామిడికాయల మండీవద్ద 2017లో 30సెంట్లు భూమిని కొనుగోలు చేశామన్నారు. రెండేళ్ల తర్వాత అందులో నిర్మాణం చేపట్టేందుకు వెళితే కొందరు టీడీపీ నేతలు అడ్డుకుని, స్థలం తమదంటూ దౌర్జన్యం చేస్తున్నారని వాపోయారు. ఈ విషయంపై పోలీసులకు, గవర్నర్‌కు, సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌కు ఫిర్యాదు చేశామన్నారు. విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని కోరారు.

అధునాతన వైద్యంతో పిత్తాశయంలో రాళ్ల తొలగింపు



కోలుకున్న బాధితురాలితో డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం

తిరుపతి(వైద్యం), ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): అధునాతన పద్ధతిలో 41 ఏళ్ల మహిళ పిత్తాశయంలోని రాళ్లను తొలగించి ఆమె ప్రాణాలు నిలబెట్టామని రష్ ఆస్పత్రి అధినేత డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం తెలిపారు. రష్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో సోమవారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఆయన వివరాలు వెల్లడించారు. కొన్నేళ్లుగా తీవ్ర కడుపునొప్పితో బాధపడుతున్న మహిళ(41) పలు ఆస్పత్రుల్లో చూపించుకున్నా ఫలితం లేకపోవడంతో చివరకు రష్ ఆస్పత్రికి వచ్చిందన్నారు. పరీక్షించగా పిత్తాశయంలో ఎన్నో ఏళ్లుగా పేరుకుని ఉన్న రాళ్లను గుర్తించామని తెలిపారు. అధునాతన వైద్య పద్ధతులతో ల్యాప్రోస్కోపీ చికిత్స చేసి రాళ్లను పూర్తిగా తొలగించి, గంటల వ్యవధిలోనే ఆమెను ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశామన్నారు. అధునాతన వైద్య పరికరాలు, నిపుణులు ఉండటం వలనే ఇది సాధ్యమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చందన్‌కుమార్, పవన్‌కుమార్, తేజశ్రీ పాల్గొన్నారు.

తుడా పరిపాలనాధికారిగా శైలజ

తిరుపతి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ పరిపాలనాధికారిగా డాక్టర్ ఎస్.శైలజ నియమితులయ్యారు. ప్రస్తుతం చిత్తూరు జిల్లా యాదమరిలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌గా పనిచేస్తున్న ఆమెను ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ నుంచి డెప్యుటేషన్‌పై మున్సిపల్ పాలనా శాఖకు బదిలీ చేస్తూ తుడా పరిపాలనాధికారిగా నియమించింది. సంబంధిత పోస్టులో ఆమె ప్రాథమికంగా ఏడాది పాటు కొనసాగనున్నారు. మున్సిపల్ పరిపాలనా శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ సోమవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

తిరుమలలో 16న గోకులాష్టమి ఆస్థానం


● మరుసటి రోజు ఉట్లోత్సవం

తిరుమల, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వరస్వామిని సాక్షాత్తు ద్వాపరయుగపురుషుడైన శ్రీకృష్ణుడిగా స్మరించుకుని ఈనెల 16వ తేదీన శ్రీకృష్ణజన్మాష్టమి సందర్భంగా తిరుమలలో గోకులాష్టమి ఆస్థానం నిర్వహించనున్నారు. శ్రీవారి ఆలయంలోని బంగారు వాకిలి ముఖ మండపంలో రాత్రి 8 నుంచి 10 గంటల వరకు గోకులాష్టమి ఆస్థానం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా బంగారు సర్వభూపాల వాహనంపై శ్రీకృష్ణస్వామిని వేంచేపు చేసి నివేదనలు సమర్పిస్తారు. ఉగ్రశ్రీనివాసమూర్తికి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు, కృష్ణస్వామికి ఏకాంతంగా తిరుమంజనం నిర్వహిస్తారు. అనంతరం ద్వాదశారాధనం చేపడతారు. 17వ తేదీన తిరుమలలో ఉట్లోత్సవాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటలకు ఈ ఉత్సవాన్ని తిలకించడానికి మలయప్పస్వామి బంగారు తిరుచ్చిపై, శ్రీకృష్ణస్వామి మరో తిరుచ్చిపై తిరుమాడవీధుల్లో విహరిస్తారు. ఆలయం ముందు యువకులు ఎంతో ఉత్సాహంతో పాల్గొని ఉట్లను కొడతారు. ఈ ఉత్సవాన్ని పురస్కరించుకుని 17వ తేదీన శ్రీవారి ఆలయంలో నిర్వహించే ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 20 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.73 కోట్లు
ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 82,628
తలనీలాలు సమర్పించినవారు: 30,505



● నేడు ఏనుగుల దినోత్సవం

గజరాజుకు రక్షణ ఏదీ?

● అంతరిస్తున్న అడవులతో ఆవాసాలకు దూరం




ఏనుగు బతికినా పదివేలే.. చనిపోయినా పదివేలే అంటారు. బతికితే గజరాజులా బతకాలని కూడా చెబుతారు. ఎందుకంటే ఏనుగు తెలివైన జంతువే కాదు. స్వేచ్ఛా జీవి కూడా.. సమూహంగా ఉంటూ నాయకత్వం చాటుకుంటుంది. కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉన్న తోటి ఏనుగును ఇట్టే గుర్తు పడుతుంది. ప్రయాణించిన మార్గాన్ని ఎప్పటికీ మర్చిపోదు.. పిల్లలతో ఉన్నపుడు దాని దగ్గరకు వెళ్లాలంటే పులులు, సింహాలే వెనుకడుగేస్తాయి...ఇన్ని విశిష్ట లక్షణాలున్నఏనుగు ఆవాసానికి క్రమేపీ చోటు కరువవుతోంది. ఏనుగుల దినోత్సవం(మంగళవారం) సందర్భంగా ప్రత్యేక కథనం.

- మంగళం, ఆంధ్రజ్యోతి

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని శేషాచల కొండల్లో వందకుపైగా ఏనుగులు ఉన్నట్లు ఫారెస్ట్ అధికారుల అంచనా. గత పదేళ్లలో తిరుపతి పరిసర అటవీప్రాంతాల్లో ప్రమాదవశాత్తూ నాలుగు చనిపోయాయి. కొన్నాళ్లుగా ఇక్కడి అటవీప్రాంతంలో ఆవాసానికి అనువైన పరిస్థితులు కొరవడుతున్నాయి. అడవులను నరికివేయడం, ఆక్రమించి వ్యవసాయం చేయడం, కొన్నిచోట్ల ఎర్రచందనం కోసం స్మగ్లర్లు అలజడి సృష్టించడం లాంటి కారణాలతో ఏనుగులు బయటకు వస్తున్నాయి. సమీపంలో నీరు,ఆహారం కోసం దాడులు చేస్తున్నాయి. పంటపొలాలను ధ్వంసం చేస్తున్నాయి. రైతులను నష్టపరుస్తున్నాయి. కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వీటిని తిరిగి అరణ్యమార్గం పట్టించడం అధికారులకు సవాలుగా మారుతోంది. ఈనేపథ్యంలో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుంది. కర్ణాటక నుంచి నాలుగు కుంకీ ఏనుగులను రప్పించింది. వీటి నిర్వహణపై ఇక్కడి సిబ్బందికి శిక్షణ కూడా ఇప్పించింది. పలమనేరు మండలంలో ప్రస్తుతం ఈ కుంకీలు తమ పనిని ప్రారంభించాయి. గుంపులుగా ఉన్న ఏనుగులను ఒడుపుగా అడవిలోని పంపేందుకు శ్రమిస్తున్నాయి..

ప్రత్యేక టాస్క్‌ఫోర్సు

ఏనుగుల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక టాస్క్‌ఫోర్సును కూడా ఏర్పాటు చేసింది. ఇందులోఎఫ్‌ఆర్వో, డీఎఫ్‌వో పర్యవేక్షణలో పదిమంది సిబ్బంది, ఇద్దరు పరిశోధకులు, పనిచేస్తున్నారు. ఉనికి గుర్తించేందుకు జీపీఎస్, డ్రోన్లు, ట్రాప్ కెమెరాలు ఉపయోగిస్తున్నారు. వాటి ఆవాసాలను సంరక్షించడం, అడవుల్లో నీటితొట్టెలు ఏర్పాటుచేయడం, పంట పొలాలకు వచ్చినపుడు సురక్షితంగా తిరిగి మళ్లించడంలాంటి చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల జాతీయ కమిటీ పర్యటించి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించింది. కారిడార్ల ద్వారా ప్రత్యేక రక్షణ కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు అధికారులు చెబుతున్నారు.



కీరమంద ప్రాంతానికి కుంకీలను తరలిస్తున్న మావటీలు

జూపార్కులోనూ ఉన్నాయోచ్

తిరుపతి ఎస్వీ జూపార్కులో ఐదు ఏనుగులను సంరక్షిస్తున్నారు. వీటిలో 3మగవి, రెండు ఆడవి. వీటికి రోజుకు రూ.2,350, వారానికి రూ.16,450, నెలకు రూ.70,500 ఖర్చు చేస్తున్నారు. వీటి సంరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలంటే దత్తత తీసుకునే అవకాశం ఉందని జూ అధికారులు చెబుతున్నారు.

బోసిపోయిన కలెక్టరేట్



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ శుభం బన్సల్

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 188 అర్జీలు అందాయి. అందులో భూ సమస్యలపై 108 ఉన్నాయి. శ్రీకాళహస్తిలో నియోజకవర్గ స్థాయి పీజీఆర్ఎస్ నిర్వహించడంతో అటువైపు ప్రజలు వెళ్లారు. దీంతో కలెక్టరేట్ వేదికగా జరిగిన పీజీఆర్ఎస్‌కు అర్జీదారులు పలుచగా కనిపించారు. కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, ఇతర అధికారులు వినతులు స్వీకరించారు.

రీజినల్ అగ్రికల్చర్ కోడింగ్ సెంటర్ ప్రారంభం



కోడింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నానీ

చంద్రగిరి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మార్కెట్ యార్డు ఆవరణలో రూ.కోటితో ఏర్పాటు చేసిన రీజినల్ అగ్రికల్చర్ కోడింగ్ సెంటర్‌ను ఎమ్మెల్యే పులివర్తి నాని సోమవారం ప్రారంభించారు. రాయలసీమ జోన్‌లో తొలిసారిగా ఎరువులు, పురుగు మందులు, విత్తనాలకు సంబంధించిన కోడింగ్ కేంద్రాన్ని చంద్రగిరిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. దీని ద్వారా పంటల వివరాలు, దిగుబడి అంచనాలు, వాతావరణ సమాచారం, భూసారం వంటి కీలకమైన డేటాను సేకరిస్తారన్నారు. ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, విత్తనాలు, ఎరువుల పంపిణీ వంటి కార్యక్రమాలను పర్యవేక్షిస్తుందన్నారు. పంట నష్టాల అంచనా, సాంకేతిక సహాయం అందించడంలో కూడా కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పల్లినేని సుబ్రమణ్యంనాయుడు, ఏఎంసీ చైర్మన్ గౌస్‌బాషా, డీఏవో ప్రసాద్‌రావు, రీజనల్ కోడింగ్ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్ మల్లికార్జునయ్య, ఏవోలు విజయ్‌భాస్కర్, జోత్స్న, ఎంపీడీవో వెంకటరత్నం, తహసీల్దార్ శివరామసుబ్బయ్య, టీడీపీ నాయకులు బాలకృష్ణమూర్తి, జనసేన్ నేత దేవర మనోహర్, బీజేపీ నాయకుడు నరేష్‌కుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్సీ కమిషన్ చైర్మన్ రాక

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 11(ఆంధ్రప్రదేశ్): రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ తిరుపతి జిల్లా పర్యటనకు మంగళవారం రానున్నారు. విజయవాడ నుంచి రోడ్డు మార్గాన మధ్యాహ్నం 12గంటలకు రుయా ఆస్పత్రికి చేరుకుంటారు. వైసీపీ రౌడీమూకల దాడిలో గాయపడ్డ పవన్‌ను పరామర్శిస్తారు. అనంతరం మీడియాతో మాట్లాడతారు. 2గంటలకు అధికారులతో సమీక్షించి, తిరిగి విజయవాడకు బయలుదేరి వెళతారు.

ఫార్మసీ డిప్లొమా ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఫార్మసీ డిప్లొమా కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఇంటర్ ఎంపీసీ, బైపీసీ ఉత్తీర్ణత పొందిన వారు ఈనెల 19వ తేదీలోపు ఏపీఎస్‌బీటీఈటీ.. ఆన్‌లైన్ లింక్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుతో తిరుపతి పద్మావతి పాలిటెక్నిక్‌లో ఉచిత హాస్టల్ వసతి, భోజన సదుపాయం కల్పించనున్నారు. సమగ్ర సమాచారం కోసం 9299008151లో సంప్రదించవచ్చు. ఈ మేరకు పద్మావతి పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ పద్మావతమ్మ తెలిపారు.

పేదల సాగు భూములను వారికే ఇవ్వాలి

● సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



నక్కలవారికండ్రిగలో భూములను పరిశీలిస్తున్న నారాయణ

చిల్లకూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నిరుపేద దళితులు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ మిగులు భూములను పేదలకే పంపిణీ చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. సోమవారం మండలంలోని నక్కలకాలవ కండ్రిగ వద్ద నిరుపేద దళితులు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములను ఆయన స్థానికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ నెలబల్లిరెట్టపల్లి పంచాయతీలోని నక్కలకాలువ కండ్రిగ వద్ద ఉన్న సుమారు 45 ఎకరాల ప్రభుత్వ భూములను 22 ఏళ్లుగా దళితులు సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. ప్రస్తుతం కొందరు టీడీపీ నాయకులు నిరుపేదలపై అక్రమ కేసులు పెడుతూ భూములను ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారని ఆరోపించారు. ఆ భూములను పేదలకు కేటాయించే వరకు సీపీఐ ఆధ్వర్యంలో పోరాటాలు సాగిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్, శశికుమార్, సీవీఆర్ కుమార్, నారాయణ, రమేష్, సునీల్, శ్రీనివాసమూర్తి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

భానుప్రకాష్‌రెడ్డికి పలువురి పరామర్శ



భానుప్రకాష్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి

తిరుపతి (ఉపాధ్యాయనగర్), ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు, బీజేపీ రాష్ట్ర నేత భానుప్రకాష్‌రెడ్డిని పలువురు ప్రముఖులు పరామర్శించారు. ఆయన తల్లి గుడుపల్లి అరుణమ్మ (80) ఆదివారం మృతిచెందిన విషయం విదితమే. సోమవారం పలువురు ప్రముఖులు ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి నివాళుర్పించారు. భానుప్రకాష్‌రెడ్డి కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఇందులో ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి, తిరుపతి, చంద్రగిరి, నగరి, పూతలపట్టు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, గాలి భానుప్రకాష్, మురళి, ఎమ్మెల్సీలు సిపాయి సుబ్రహ్మణ్యం, బత్తల చెంగల్రాయులు, తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఏపీ హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, డీఆర్‌డీఓ చైర్మన్ సతీష్‌రెడ్డి, ఏపీ గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ సుగుణమ్మ, శాప్ చైర్మన్ రవినాయుడు, టీటీడీ అదనపు ఈవో వెంకయ్యచౌదరి, జేఈవో వీరబ్రహ్మం. డిప్యూటీ మేయర్లు ఆర్సీ మునికృష్ణ, ముద్రనారాయణ, మున్సిపల్ అడిషనల్ కమిషనర్ చరణ్ తేజ్, టీడీపీ నేతలు భువన్‌కుమార్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి తదితరులు ఉన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు గోవిందధామంలో దహనక్రియలు నిర్వహించారు.





ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్ - పీజీఆర్ఎస్‌కు వచ్చిన ప్రజలు

శ్రీకాళహస్తిలో ప్రత్యేక పీజీఆర్ఎస్

హాజరైన కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే సుధీర్ ● 1,500పైగా వచ్చిన అర్జీలు

శ్రీకాళహస్తి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలకోసం ప్రత్యేకంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పట్టణంలోని పంచాయతీరాజ్ అతిథిగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో 1,500మందికి పైగా ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం అర్జీలు ఇచ్చారు. ఆయా మండలాలకు సంబంధించి వేర్వేరుగా అధికార యంత్రాంగాన్ని ఏర్పాటు చేశారు. కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే సుధీర్, ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి పీజీఆర్ఎస్ ఉద్దేశాన్ని ప్రజలకు వివరించారు. అనంతరం ఫిర్యాదులను స్వీకరించారు. అక్కడికక్కడే ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... శ్రీకాళహస్తి నియోజకవర్గంలో సుమారు 2వేలమందికి పైగా సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. అందులో 90శాతం రెవెన్యూ సమస్యలే ఉన్నాయన్నారు. చాలామంది కలెక్టరేట్‌కు వెళ్లలేని పరిస్థితి ఉండటంతో తన విజ్ఞప్తికి ఆయన సానుకూలంగా స్పందించి ప్రత్యేక గ్రీవెన్స్‌ను ఏర్పాటు చేశారన్నారు. ప్రతి మూడు నెలలకోసారి ఇదే తరహాలో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించాలని కలెక్టర్‌ను కోరారు. చెంబేడు కాలువను శుభ్రం చేసేందుకు ప్రభుత్వం తరపున కలెక్టర్ సహకరించాలని కోరారు. రేణిగుంట, ఏర్పేడు మండలాల నుంచి భూ సమస్యలు రాష్ట్రస్థాయిలోనే అత్యధికంగా నమోదవుతున్నాయని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. ఈ పరిస్థితుల దృష్ట్యా శ్రీకాళహస్తిలోనే ప్రత్యేకంగా గ్రీవెన్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. సెప్టెంబరు చివరి వారంలో మళ్లీ ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తామన్నారు. విడతల వారీగా అన్ని సమస్యలు పరిష్కారమయ్యే వరకు గ్రీవెన్స్‌ను కొనసాగిస్తామన్నారు. డీఎస్పీ నరసింహమూర్తి, ఏపీ ఐఐసీ జోనల్ మేనేజర్ భరత్‌రెడ్డి, శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ భవానీప్రసాద్, నాలుగు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, విద్యుత్, ఇరిగేషన్, హౌసింగ్, కార్మిక, పశుసంవర్ధక శాఖల అధికారులు పాల్గొన్నారు.





జలపాతాల కొండ

ఉండి ఉండీ దంచిపోస్తున్న వానలకు తిరుమల కొండల్లో జలపాతాలు ఉరికి దూకుతున్నాయి. ఆదివారం రాత్రి నుంచే కపిలతీర్థం ఉధృతంగా ప్రవహిస్తుండగా, సోమవారం ఉదయానికి మాలాడగుండం కూడా జాలువారుతోంది. గరుడవారధి మీద తిరుమలకు ప్రయాణించే వాహనాల్లోని యాత్రీకులకు ఈ జలపాతాలు కనువిందు చేస్తున్నాయి. కపిలతీర్థంకి జనం పోటెత్తి వస్తున్నారు. ఇక్కడ నిలిపేస్తున్న వాహనాలతో నంది సర్కిల్‌లో ట్రాఫిక్‌కి తీవ్ర అంతరాయం కలుగుతోంది. దివ్యారామం కొలను ముందు ప్రకృతి ప్రేమికులు పెద్ద సంఖ్యలో కనిపిస్తున్నారు. ఫొటోలు తీసుకుంటూ సందడి చేస్తున్నారు.







ప్రశాంతంగా మున్సిపల్ సమావేశం


సమావేశమైన కౌన్సిలర్లు, అధికారులు

వెంకటగిరి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ అధ్యక్షతన సోమవారం జరిగింది. మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ లాయర్ జయప్రకాష్‌ను తొలగించి కొత్త స్టాండింగ్ కౌన్సిల్‌ను నియమించాలన్న అంశాన్ని అజెండా నుంచి తొలగించాలని వైసీపీ కౌన్సిలర్లు ఏకగ్రీవంగా తీర్మానించారు. అదేవిధంగా గ్రామశక్తి పోలేరమ్మ జాతర ఏర్పాట్లకు మున్సిపాలిటీకి సంబంధించి రూ.50 లక్షలు బిల్లులు పెట్టారు. పోలేరమ్మ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించడంతో నిర్వహణ ఏర్పాట్లకు అవసరమైన రూ.50 లక్షల నిధులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ ఏడాది కూడా మున్సిపాలిటీకి సంబంధం లేకుండా జాతర ఏర్పాట్లకు అయ్యే ఖర్చును దేవదాయశాఖ భరించాలని ఆ శాఖకు లెటర్ పెట్టాలని కోరారు. అలాగే యోగాంధ్ర కార్యక్రమ ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం భరించకుండా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న మున్సిపాలిటీపైకి నెట్టడమేంటని కమిషనర్‌ను కౌన్సిలర్లు ప్రశ్నించారు.

ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేయాలి


సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనాకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

గూడూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి మండలం కలపాడు గ్రామంలో పేదలు సాగుచేసుకుంటున్న ప్రభుత్వ భూములను వారికే పంపిణీ చేయాలని సీపీఎం నాయకులు కోరారు. సోమవారం సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వెంకటగిరి మండలం కలపాడు గ్రామంలో సుమారు 110 మంది నిరుపేదలు ప్రభుత్వ భూములను సాగుచేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ భూములను కొందరు ఆక్రమించుకుని పేదలకు అన్యాయం చేస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి పేదలకు న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చెంగయ్య, శివకుమార్, బీవీ.రమణయ్య, చంద్రయ్య, చెంచుకృష్ణయ్య, బాలసుబ్రహ్మణ్యం, చెంచురామయ్య తదితరులు పాల్గొన్నారు.

కోళ్లఫారం ఏర్పాటుపై చర్యలు తీసుకోండి


తహసీల్దార్ హరికృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

పెళ్లకూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లకూరు గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తున్న కోళ్లఫారంపై చర్యలు తీసుకోవాలంటూ తహసీల్దార్ హరికృష్ణకు టీడీపీ నాయకులు సోమవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, సీనియర్ నాయకుడు పేరం రమేష్‌నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని ఆక్రమించి కోళ్లఫారం ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. భూమి లెవలింగ్‌కు కూడా అక్రమంగా చెరువు మట్టిని తరలించారని, అలాగే కోళ్లఫారానికి వెళ్లేందుకు చెరువులో గ్రావెల్ రోడ్డు నిర్మించారని చెప్పారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వ భూమిని సెంటు ఆక్రమించినా సర్వే చేసి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హరికృష్ణ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, శిరసనంబేటి చైతన్యకృష్ణారెడ్డి, దువ్వూరు రాకేష్‌రెడ్డి, మునీష్, లోకేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు


సమావేశంలో మాట్లాడుతున్న వేణుగోపాలరావు

దక్కిలి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువులతో పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు పొందవచ్చని జిల్లా వ్యవసాయశాఖ అధికారి వేణు గోపాల రావు అన్నారు. దక్కిలి వ్యవసాయశాఖ కార్యాలయంలో సోమవారం పీఎంఆర్‌కే వీవై పథకం ద్వారా రైతులకు పంటల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో సమగ్ర యాజమాన్యం పద్ధతులు పాటిస్తే లాభదాయకంగా ఉంటుందన్నారు. రసాయన ఎరువులను తగ్గించి, సేంద్రియ ఎరువులను వాడాలన్నారు. అలాగే పురుగు మందుల స్థానంలో జీవ శిలీంధ్ర నాశకాలు, లింగాకర్షక బుట్టలు, జిగురు అట్టలు వినియోగించాలని సూచించారు. వ్యవసాయశాఖ అధికారిణి శిరీషా మాట్లాడుతూ పంటల బీమా గురించి వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దక్కిలి టీడీపీ పట్టణ అధ్యక్షుడు చంద్రారెడ్డి, నీటి సంఘం అధ్యక్షుడు సునీల్ యాదవ్, వ్యవసాయశాఖ సహాయకుడు శ్రీనివాస్, ఏఈవో రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు వద్దు


సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న వామపక్ష నాయకులు

గూడూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వ హించారు. సామాన్యులకు భారంగా మారబోతున్న విద్యుత్ స్మార్ట్‌మీటర్లను ప్రజలు వ్యతిరేకించాలన్నారు. అదానీ సంస్థకు ప్రజాధనాన్ని కూడబెట్టేందుకు స్మార్ట్‌మీటర్ల ప్రక్రియను తీసుకువచ్చారన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ రాఘువేంద్ర మీనాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శివకుమార్, ప్రభాకర్, వెంకట్రామిరెడ్డి, బీవీ.రమణయ్య, శశికుమార్, సీవీఆర్.కుమార్, శంకరయ్య, శ్రీనివాసులు, ప్రసాద్, చంద్రయ్య, రమేష్, నారాయణ, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల బిగింపు నిర్ణయం వెనక్కి తీసుకోవాలి

సూళ్లూరుపేట, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌మీటర్ల బిగింపు నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం మన్నారు పోలూరు సబ్‌స్టేషన్ వద్ద స్థానికులు నిరసన తెలిపారు. సీపీఐ నియోజకవర్గ నాయకుడు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ బిల్లులు అధికంగా వస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నా స్మార్ట్ మీటర్లు బిగించడం సరికాదన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

పెళ్లకూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగలను కర్రతో కదిలించే క్రమంలో విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం సాయంత్రం మండల కేంద్రమైన పెళ్లకూరులో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు... గ్రామానికి చెందిన మెరిమి సుధాకర్(29) ఇంట్లోకి విద్యుత్ సరఫరా సక్రమంగా రాకపోవడంతో కర్రతో స్తంభానికి ఉన్న వైర్లను కదిలించాడు. ఈ క్రమంలో విద్యుదాఘాతం జరగడంతో సుధాకర్ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోగా, వెంటనే శ్రీకాళహస్తి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ ఢీకొని తమిళనాడువాసి...

తడ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని బైక్ ఢీకొని తమిళనాడు వవాసి మృతి చెందాడు. తమిళనాడులోని మాదరపాకం తాలుక అప్పాయిపాలెం గ్రామానికి చెందిన వీరయ్య(59) సోమవారం తడకు వచ్చాడు. తిరిగి వెళుతుండగా స్థానిక భారత్ పెట్రోల్ బంకు ఎదురుగా రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని బైక్ వేగంగా వీరయ్యను ఢీకొంది. 108 వాహనంలో సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రమాదానికి కారణమైన మోటారు సైకిలిస్టు పరారయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఇటీవల బజారు వీధుల్లో ట్రాఫిక్ నియంత్రిస్తున్న పోలీసులు (ఫైల్‌ఫొటో) - సోమవారం నాడు ఆర్టీసీ బస్టాండు వద్ద నడి రోడ్డులోనే వాహనాలు

పట్టుమని పది రోజులే!

- యథావిధిగా రోడ్లపై వాహనాల పార్కింగ్
- పట్టణవాసులకు తప్పని ట్రాఫిక్ తిప్పలు

సూళ్లూరుపేట, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ ఇటీవల సూళ్లూరుపేటలో పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో సీఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో ముగ్గురు ఎస్‌ఐలు, సిబ్బంది లాఠీలు పట్టుకుని తిరిగి హడావిడి చేశారు. సీఐతో పాటు సూళ్లూరుపేట, తడ, శ్రీహరికోట ఎస్‌ఐలు బ్రహ్మనాయుడు, కొండపనాయుడు, స్వప్న, ఇతర సిబ్బంది జీఎస్‌టీ రోడ్డుతో పాటు ప్రధాన వీధులన్నీ తిరిగి రోడ్డుపైకి చొచ్చుకొచ్చిన దుకాణాలుదారులను వెనక్కి పంపించారు. అదేవిధంగా ఆర్టీసీ బస్టాండు, ఇతర ప్రాంతాల్లో రోడ్లకు అడ్డంగా పెట్టిన ఆటోలు, ఇతర వాహనదారులను హెచ్చరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇకపై పట్టణంలో ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అయితే పట్టుమని పదిరోజులు కాకనే యథావిధిగా పట్టణ వాసులకు ట్రాఫిక్ చిక్కులు తప్పడం లేదు. కొందరు వాహనదారులు మద్యం తాగి రోడ్డుకు అడ్డంగా వాహనాలు ఆపడమే కాకుండా, ప్రశ్నించిన వారిని పరుష పదజాలంతో దూషిస్తున్నారు. ప్రధాన కూడళ్లలో ఉన్న ట్రాఫిక్ పోలీసు సిబ్బంది నిబంధనలు పాటించని వాహనాల ఫొటోలు తీసి వాట్సప్‌లో పెట్టేసి పనైపోయిందన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటి వరకు ఎక్కడా ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకోలేదు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ప్రతిరోజూ సిబ్బందిని నియమించి ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకుండా చూడాల్సిన అవసరం ఉంది.

అభివృద్ధితో పాటు సంక్షేమానికీ ప్రాధాన్యం: పాశం


కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధితో పాటు సంక్షేమానికీ ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. సోమవారం గూడూరు పట్టణంలోని బనిగిసాహెబ్‌పేటలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్న ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఇప్పటికే పింఛన్ల పెంపు, ఉచితంగా గ్యాస్ సిలండర్లు పంపిణీ, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలను అమలు చేయడం జరిగిందన్నారు. ఈనెల 15నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం అమలు చేయనున్నట్లు చెప్పారు. సూపర్‌సిక్స్ హామీలను ఒక్కొక్కటిగా ఏడాది లోగా సీఎం చంద్రబాబు అమలు చేసి చూపారన్నారు. గత వైసీపీ ప్రభుత్వ అరాచక పాలన వల్ల రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిందన్నారు. ప్రజల నుంచి వస్తున్న ఆదరణను తట్టుకోలేని వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు, విమర్శలు చేయడం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, అల్లీహుస్సేన్, అబ్దుల్ రహీం, బిల్లు చెంచురామయ్య, రవీంద్రరెడ్డి, గురవయ్య, మోహన్, వాటంబేడు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

14న ఇరకంకుప్పంవాసులకు ఇళ్ల పట్టాల పంపిణీ

తడ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇరకంకుప్పం గ్రామస్తులకు పూడికుప్పం గ్రామంలో ఈనెల 14న ఇళ్ల పట్టాలు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దారు శరత్‌బాబు తెలిపారు. ఇరకంకుప్పం గ్రామస్తులకు పూడికుప్పంలో ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పట్టాల పంపిణీకి జిల్లా అధికారులు రంగం సిద్ధం చేసుకున్నారు. పది రోజుల క్రితం వీటిని పంపిణీ చేయాలని నిర్ణయించి, ఆమేరకు ఏర్పాట్లు చేయగా భారీ గాలి, వర్షం కురవడంతో ఆ కార్యక్రమం రద్దు అయ్యింది. ఈనెల 1న ఇరకం గ్రామంలో పర్యటించిన కలెక్టర్ వెంకటేశ్వర్ ఈనెల 15వ తేదీలోగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తామని ప్రకటించారు. ఆ మేరకు 14వ తేదీ గురువారం జిల్లా ఇన్‌చార్జి రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీల చేతులమీదుగా పట్టాల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. తహసీల్దారు శరత్‌బాబు మాట్లాడుతూ మొత్తం 172 మందికి ఇళ్ల స్థలాలు కేటాయిస్తున్నామని చెప్పారు.

సింగిల్ విండో కార్యవర్గ ప్రమాణ స్వీకారం


ప్రమాణస్వీకారం చేస్తున్న సింగిల్ విండో అధ్యక్షుడు, డైరెక్టర్లు

కోట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కోటలోని తిన్నెలపూడి సింగిల్ విండో కార్యవర్గ ప్రమాణ స్వీకారం సోమవారం జరిగింది. అధ్యక్షుడిగా కొక్కుపాడు గ్రామానికి చెందిన పలగాటి భాస్కర్‌రెడ్డి, డైరెక్టర్లుగా వెంకన్నపాళెం గ్రామానికి చెందిన పనబాక కోటేశ్వరరావు, తిన్నెలపూడి గ్రామానికి చెందిన పుచ్చలపల్లి చిరంజీవులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో సీఈవో , టీడీపీ నాయకులు నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, జలీల్ అహ్మద్, మోహన్‌రెడ్డి, మధుయాదవ్, చాపల శ్రీనివాసులు పాల్గొన్నారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

చిల్లకూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతవరం, వల్లిపేడు గ్రామాల్లో సోమవారం తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర వైద్యవిజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. మహిళలకు, పురుషులకు నోటి క్యాన్సర్, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణకు పాప్‌స్మియర్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా చింతవరం, వల్లిపేడు వైద్యాధికారులు సుమ, దినేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని పింక్ బస్సుల ద్వారా ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహిస్తోందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌వీకుమార్, నాగరాజ్, లలిత, శివశంకర్, పద్మావతి, చైతన్యభాను, వెంకటేశ్వర్లు, సాయిబాబా, ప్రకాష్, గోపాల్, హజరతయ్య, శాంతి, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పదవుల్లో బీసీలకు సముచిత స్థానం: పాశం


ఎడ్ల బండిపై ర్యాలీగా వెళుతున్న ఎమ్మెల్యే పాశం, మాజీ మంత్రి పరసా

చిట్టమూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పదవుల్లో బీసీలకు సముచిత స్థానం కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ చెప్పారు. సోమవారం చిట్టమూరు సొసైటీ కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా విచ్చేసిన ఎమ్మెల్యే సునీల్ కుమార్, మాజీ మంత్రి పరసా రత్నంలకు టీడీపీ నాయకులు, రైతులు గజమాలతో స్వాగతం పలికారు. ఎడ్ల బండిపై ర్యాలీగా సొసైటీ కార్యాలయానికి తీసుకెళ్లారు. సొసైటీ చెర్మన్ కస్తూరయ్య, సభ్యులుగా వెంకటరమణయ్య, మోహనయ్య చేత ఎమ్మెల్యే ప్రమాణం చేయించారు. అనంతరం సునీల్ కుమార్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో నాసిరకం మద్యం విక్రయించడం వల్ల సుమారు 70 వేల మంది లివర్, కిడ్నీ, గుండె సంబంధిత రోగాలతో ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఐదు పథకాలను అమలు పరిచామన్నారు. మండలంలో అన్నదాత సుఖీభవ పథకం కింద 4,898 మంది రైతులకు రూ.3.37 కోట్లు అందించామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శివకోటరెడ్డి, జనార్దన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, మధురెడ్డి, సునీల్‌రెడ్డి, వాకాడు ఏఎంసీ చెర్మన్ దారా ప్రమీల, భారతమ్మ, హరికృష్ణారెడ్డి, చిన్నారావు, బాబు నాయుడు, గోపాల్ నాయుడు, రాజేష్ రెడ్డి, ఎన్ఆర్ఐ కృష్ణ, చెంచురామయ్య ఆచారి, అనురాధ, గిరి నాయుడు, రషీద్, బషీర్, కోట, వాకాడు టీడీపీ నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సినిమాలు ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలి

వెంకటగిరి టౌన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): సినిమాలు ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని సీఐ రమణ అన్నారు. సోమవారం పట్టణంలోని పింజల వీరయ్య కల్యాణ మండపంలో నాటకమే కదా జీవితమంతయూ...' సినిమా ట్రైలర్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులపై సినిమా తీయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో దర్శకులు ఉపేంద్ర, ప్రకాష్, మహేష్, ప్రకాష్, సంజునాని, లియో తదితరులు పాల్గొన్నారు.


సినిమా ట్రైలర్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐ రమణ

అసాంఘిక కార్యక్రమాలపై డ్రోన్‌తో నిఘా

నాయుడుపేట టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యక్రమాలపై డ్రోన్‌తో నిఘా పెట్టి చర్యలు చేపడుతున్నట్లు డీఎస్పీ చెంచుబాబు అన్నారు. సోమవారం పోలీసు సిబ్బందికి డ్రోన్ వినియోగంపై సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ ఐసోలేటెడ్ ప్రాంతాల్లో ఓపెన్ డ్రింకింగ్, ఈవ్‌టీజింగ్, గంజాయి తాగడం, ఇతర అసాంఘిక కార్యక్రమాలపై డ్రోన్ ద్వారా నిఘా పెట్టడం జరుగుతుందన్నారు. డీఎస్పీ వెంట అర్బన్ సీఐ బాబి, ఎస్‌ఐ ఆదిలక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

సింగిల్ విండో అధ్యక్షుడికి సన్మానం


అంకయ్యను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

నాయుడుపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం కురుగొండ సింగిల్ విండో అధ్యక్షుడిగా నియమితులైన దారా అంకయ్యను సోమవారం నాయుడుపేటలోని ఆయన స్వగృహంలో టీడీపీ నాయకులు శాలువ, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో గోను బాబు, ఉచ్చూరు వెంకటయ్య, ముసులూరు శ్రీనివాసులు, పాలేటి అంకయ్య, ముత్యాలుబాబు, సిద్ధార్థ, పసల సురేష్, ఈశ్వరయ్య, సతీష్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ చైర్లు పంపిణీ

గూడూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం సోమవారం జరిగింది. క్లబ్ అధ్యక్షుడిగా రమణయ్య, కారదర్శిగా రవిచంద్ర, కోశాధికారిగా వీరేంద్రనాథ్‌తో పాటు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం మండలంలోని విందూరు పాఠశాల విద్యార్థులకు స్టడీ చైర్లు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ చైర్మన్ రియాజ్ అహ్మద్, భయ్యా రవికుమార్, రామ్మోహన్ రావు, కుమార్, ఆర్‌వీ.రావు, మురళీరెడ్డి, సోమిశెట్టి చెంచురామయ్య, శీనయ్య, రూపేష్‌రెడ్డి, మస్తాన్, వేణు తదితరులు పాల్గొన్నారు.

జీలగల పంపిణీ

కోట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కోటలోని రైతు సేవాకేంద్రంలో సోమవారం రైతులకు సబ్సిడీపై జీలగ విత్తనాలను పంపిణీ చేశారు. =కార్యక్రమంలో ఏవో సుచేంద్రప్రసాద్, వ్యవసాయ విస్తరణ అధికారి సాయికుమార్, టీడీపీ నాయకులు జలీల్ అహ్మద్, మధుయాదవ్, శ్రీధర్‌రెడ్డి, నాయబ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో ఫ్రెషర్స్‌కు అవగాహన

కోట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులు, తల్లిదండ్రులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డితో పాటు ఆయా విభాగాధిపతులు కళాశాలలో ఉన్న కోర్సులు, అధునాతన సాంకేతిక విద్య, తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

గ్రామోత్సవం

కోట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కేశవరంలో గల శివకోటలో రెండు రోజులుగా జరుగుతున్న భ్రమరాంబ మల్లికార్జున స్వామి విగ్రహప్రతిష్ఠలో భాగంగా సోమవారం కలశాలతో గ్రామోత్సవం జరిగింది. స్వామి, అమ్మవార్ల విగ్రహాలు, కలశాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే తిన్నెలపూడి పంచాయతీ లక్ష్మక్కకండ్రిగలో గ్రామదేవత మాతమ్మ గ్రామోత్సవం నిర్వహించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

గూడూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆస్పత్రి రోడ్డులోని ఓ ఎలక్ట్రానిక్స్ దుకాణంలో సోమవారం షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. ఇన్‌చార్జి అగ్నిమాపకశాఖ అధికారి విజయ్‌కుమార్ వివరాల మేరకు... స్థానిక ఆస్పత్రి రోడ్డులోని ఓ ఎలక్ట్రానిక్స్ దుకాణంలో షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించడంతో సిబ్బంది అగ్నిమాపకశాఖకు సమాచారం అందించారు. అగ్నిమాపకశాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.5లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు ఆయన తెలిపారు.


అగ్నిప్రమాదానికి గురైన దుకాణం

నేడు ఓజిలి మండల సమావేశం

ఓజిలి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. ఎంపీపీ గడ్డం అరుణమ్మ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యదర్శులు, అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని ఆమె కోరారు.

నిబంధనల ప్రకారమే హాస్టళ్లను నడపాలి

తడ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నిబంధనల ప్రకారమే పీజీ హాస్టళ్లను నడపాలని ఎస్‌ఐ కొండపనాయుడు స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం తడలోని పలు పీజీ హాస్టళ్లను ఆయన తనిఖీ చేశారు. వసతి పొందుతున్న ఉద్యోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. హాస్టళ్లలో వసతి పొందుతున్న ప్రతి ఒక్కరి వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మహిళకు కుట్టుమిషన్ అందజేత

గూడూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గమళ్లపాళెం ప్రాంతానికి చెందిన లక్ష్మి అనే మహిళకు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ దాతృత్వంతో కుట్టుమిషన్ అందజేశారు. కార్యక్రమంలో తీగల చంద్రశేఖర్, మోహన్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న లారీ
డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - పండ్లూరు జాతీయ రహదారి సమీపంలో ఆటోను లారీ ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పెళ్లకూరు మండలం, కొత్తూరు గ్రామానికి చెందిన సుధాకర్ ఆటోను నడుపుకుంటూ సోమవారం గూడూరుకు వెళ్తుండగా పండ్లూరు సమీపంలో లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న సుధాకర్ తీవ్రంగా గాయపడ్డాడు. హైవే అంబులెన్స్ వాహనంలో అతడిని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రి నాదెండ్లకు స్వాగతం


మంత్రి నాదెండ్లకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉయ్యాల ప్రవీణ్

నాయుడుపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్‌కు జనసేన సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి, ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ రేణిగుంట విమానాశ్రమంలో స్వాగతం పలికారు. రైల్వే కోడూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి వెళ్లేందుకు విమానాశ్రమం చేరుకున్న మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి ఉయ్యాల ప్రవీణ్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతించారు.

తడ సొసైటీ అధ్యక్షుడిగా శ్రీకాంత్‌రెడ్డి



తడ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తడ సొసైటీ అధ్యక్షుడిగా టీడీపీ నాయకుడు వేనాటి శ్రీకాంత్‌రెడ్డి నియమితులయ్యారు. ఆయనతో పాటు టీకే.రవి, కే.సుధాకర్‌ను సభ్యులుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ ముగ్గురిని టీడీపీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి మురళీరెడ్డి అభినందించారు.

వ్యాసరచన పోటీల్లో రోహిణి ప్రతిభ

నాయుడుపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గుంటూరులో జరిగిన జోనల్‌స్థాయి వ్యాసరచన పోటీల్లో నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని కె.రోహిణి ప్రథమస్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదనశర్మ తెలిపారు. సోమవారం కళాశాల అధ్యాపకులు అభినందించారు.

డీవార్మింగ్ డేను విజయవంతం చేయండి

గూడూరు అర్బన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నేషనల్ డీవార్మింగ్ డేను విజయవంతం చేయాలని ఎంపీడీవో మధుసూదన్‌రావు అన్నారు. సోమవారం డీ వార్మింగ్ డే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది నుంచి 18 ఏళ్ల వయస్సు కలిగిన విద్యార్థుల్లో నులిపురుగులను నివారించేందుకు ప్రభుత్వం ఉచితంగా ఆల్‌బెండాజోల్ మాత్రలను అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో రవీంద్రబాబు, సీడీపీవో మెహబూబీ, డాక్టర్ జ్యోతి, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

సింగల్ విండో అధ్యక్షుడిగా భాస్కర్‌రెడ్డి



రేణిగుంట, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండల ప్రాథమిక పరపతి సంఘం అధ్యక్షుడిగా పాత రేణిగుంటకు చెందిన భాస్కర్‌రెడ్డి నియమితులయ్యారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి ఆయన చేసిన సేవలను గుర్తించి సింగల్‌విండో చైర్మన్‌గా ఆయనకు అవకాశం కల్పిస్తూ ఎమ్మెల్యే సుధీర్ సోమవారం ప్రకటించారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ... తనకు అవకాశం ఇచ్చిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

అధునాతన వైద్యంతో పిత్తాశయంలో రాళ్ల తొలగింపు



కోలుకున్న బాధితురాలితో డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం

తిరుపతి(వైద్యం), ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): అధునాతన పద్ధతిలో 41 ఏళ్ల మహిళ పిత్తాశయంలోని రాళ్లను తొలగించి ఆమె ప్రాణాలు నిలబెట్టామని రష్ ఆస్పత్రి అధినేత డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం తెలిపారు. రష్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో సోమవారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఆయన వివరాలు వెల్లడించారు. కొన్నేళ్లగా తీవ్ర కడుపునొప్పితో బాధపడుతున్న మహిళ(41) పలు ఆస్పత్రుల్లో చూపించుకున్నా ఫలితం లేకపోవడంతో చివరకు రష్ ఆస్పత్రికి వచ్చిందన్నారు. పరీక్షించగా పిత్తాశయంలో ఎన్నో ఏళ్లుగా పేరుకుని ఉన్న రాళ్లను గుర్తించామని తెలిపారు. అధునాతన వైద్య పద్ధతులతో ల్యాప్రోస్కోపీ చికిత్స చేసి రాళ్లను పూర్తిగా తొలగించి, గంటల వ్యవధిలోనే ఆమెను ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశామన్నారు. అధునాతన వైద్య పరికరాలు, నిపుణులు ఉండటం వలనే ఇది సాధ్యమైందని తెలిపారు. డాక్టర్ చందన్‌కుమార్, పవన్‌కుమార్, తేజశ్రీ పాల్గొన్నారు.

నూరు శాతం అక్షరాస్యతే లక్ష్యం

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): నూరు శాతం అక్షరాస్యత లక్ష్యంగా వలంటీర్ టీచర్లు పని చేయాలని ఎంపీడీవో వెంకటరత్నమ్మ తెలిపారు. బీఎన్‌కండ్రిగ వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమంలో వలంటీర్ టీచర్లకు సోమవారం శిక్షణ నిర్వహించారు. 15 సంవత్సరాలు పైబడిన నిరక్షరాస్యులైన వారందరికీ అక్షరాలు నేర్పించాలని తెలిపారు. 2029లోపు ప్రతి ఒక్కరూ పూర్తిస్థాయిలో చదువుకునేలా చేయాలన్నారు. ఎంఈవో రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదివేలా, రాసేలా తర్ఫీదు ఇవ్వాలన్నారు. ఆరోగ్య సంరక్షణ, ఆర్థిక అక్ష్యరాస్యత, వాణిజ్య నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం మునెయ్య, సీసీలు పాల్గొన్నారు.

టెన్త్ టాపర్లకు నగదు అందజేత

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2024-25 సంవత్సరంలో టెన్త్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జ్ఞానేశ్వర్(529 మార్కులు), సుప్రియ(523 మార్కులు)కు బీఎన్‌కండ్రిగ గ్రామానికి చెందిన వెంకటరమణ్య రూ. 16వేలు నగదును హెచ్‌ఎం రమణయ్య చేతులు మీదగా అందజేశారు. ఈ సందర్భంగా వెంకటరణయ్య మాట్లాడుతూ తమ గ్రామంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులను పోత్సహించాడానికి రూ.2లక్షలను బ్యాంకులో డిపాజిట్ చేశానన్నారు. యేటా ఆ నగదుపై వచ్చే రూ. 16వేలని టాపర్లకు అందిస్తున్నానని చెప్పారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీ యత్నం



బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తంగేళ్లపురంలో వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆదివారం రాత్రి చోరీ చేసి ట్రాన్స్ ఫార్మర్‌ను పగల కొడుతుండగా సమీపంలో ఉన్న గిరిజనులు కొందరు అటు వస్తుండగా వారిని చూసి పారిపోయారు. ట్రాన్స్ ఫార్మర్ చోరీపై రైతు నాగేశ్వరరావు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ద్రౌపది ధర్మరాజస్వామి గ్రామోత్సవం

ఏర్పేడు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపానాయుడుపేటలో జరుగుతున్న ద్రౌపది ధర్మరాజస్వామి మహాభారత ఉత్సవాల్లో సోమవారం ద్రౌపది సమేత ధర్మరాజస్వామి గ్రామోత్సవం జరిగింది. చేనేత సంఘం సభ్యులు ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఉత్సవాలను తిలకించేందుకు గ్రామీణ ప్రజలు ప్రతిరోజు అధిక సంఖ్యలో ఆలయానికి వస్తున్నారు. వారికి అన్నప్రసాదాలను అందిస్తున్నారు. మాధవమాల సర్పంచ్ స్వామి అమ్మవార్లను దర్శించుకుని ఆలయానికి రూ.5,116 అందజేశారు.

ఘనంగా వసంతోత్సవం

పిచ్చాటూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్త గొల్లకండ్రిగలో సోమవారం అంకాళపరమేశ్వరి ఆలయంలో వసంతోత్సవం వైభవంగా జరిగింది. విశేషంగా అలంకరించిన అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా పసుపు నీళ్ల ఒకరిపై ఒకరు చల్లుకున్నారు.

పుత్తూరు వార్తలు

కానిస్టేబుల్‌కు ఎస్పీ నివాళులు



పుత్తూరు అర్బన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పుత్తూరు పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న అయ్యప్ప ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆదివారం రాత్రి ద్రౌపది సమేత ధర్మరాజ స్వామి తిరునాళ్లలో బందోబస్తు నిర్వహించాడు. విధులు ముగించుకుని కార్వేటి నగరం రోడ్డులోని ఇంటికి బైక్‌పై బయలుదేరాడు. రాత్రి 9.40 గంటల సమయంలో కార్వేటినగరం సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. సమాచారం అందుకున్న పుత్తూరు పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కానిస్టేబుల్ మృత్యువాత పడడంతో కన్నీటి పర్యంతమయ్యారు. సోమవారం ఉదయం అయ్యప్ప స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు అయ్యప్ప పార్థివదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. పుత్తూరు డీఎస్పీ రవికుమార్, సీఐ శేఖర్ రెడ్డి, పుత్తూరు పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

స్మార్ట్ మీటర్లు వద్దు

పుత్తూరు, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులను నిలువు దోపిడీ చేసే అదానీ స్మార్ట్ మీటర్లను తొలగించాలని సోమవారం పుత్తూరు విద్యుత్ డివిజన్ కార్యాలయం ముందు సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ కార్యదర్శి వెంకటేశ్ మాట్లాడుతూ... ఇప్పటి వరకు వసూలు చేసిన ఇంధన సర్దుబాటు చార్జీలను వినియోగదారులకు తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాల్ని రద్దు చేయకుండా కూటమి ప్రభుత్వం అమలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. డీఈ కార్యాలయ అధికారికి వినతిపత్రాన్ని అందించారు. రమణయ్య, విజయ్, సుబ్రమణ్యం పిళ్లై తదితరులు పాల్గొన్నారు.

జీవ ఇంధనాన్ని వినియోగించండి

పుత్తూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): సహజ వనరుల నుంచి ఉత్పత్తి చేసే జీవ ఇంధనం వినియోగం వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుందని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి అన్నారు. కళాశాల రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ ఇంధన దినాన్ని ఘనంగా నిర్వహించారు. బొగ్గు, పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు హరిబాబు, శంకర్రావు, విష్ణుప్రియలు పాల్గొన్నారు. ఇలావుండగా డిగ్రీ అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ భోజన విరామ సయమంలో నిరసన వ్యక్తం చేశారు.

మాజీ ఎమ్మెల్యే చెంచురెడ్డి మృతి పట్ల సంతాపం

పుత్తూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే చెంచురెడ్డి మరణం పట్ల మాజీ మంత్రి చెంగారెడ్డి సంతాపాన్ని ప్రకటించారు. హైదరాబాదు నుంచి ఆంధ్రజ్యోతి ప్రతినిధితో చెంగారెడ్డి మాట్లాడుతూ... చెంచురెడ్డి తనకు కళాశాలలో సహచర విద్యార్థి, రూంమేట్ అని గతాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన మరణం బాధ కలిగించిందని, కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతున్నానన్నారు.

సమాజసేవలో పాలు పంచుకోండి



నగదు అందిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయురాలు రేవతి

పుత్తూరు టౌన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగులు సమాజ సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యులు కావాలని పుత్తూరు విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు గుణశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పుత్తూరు విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సంఘం తరుపునా ఇప్పటికే ఉచిత వైద్య శిబిరాలు, పేద విద్యార్థులకు సామగ్రి పంపిణీ వంటి పలు సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పారిశుధ్య కార్మికులకు యూనిఫాం, ఇతర సామగ్రి అందిస్తామన్నారు.ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయురాలు రేవతి సంఘ సేవా కార్యక్రమాలకు రూ.51,116 విరాళాన్ని అందజేశారు. కుప్పయ్య, రామచంద్రరాజు, రామలింగం, వెంకటమునిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

టీపీకోట మోడల్ స్కూల్‌లో వాటర్ బెల్

నాగలాపురం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని టీపీ కోట ప్రభుత్వ మోడల్ ప్రైమరీ పాఠశాలలో వాటర్ బెల్ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. పాఠశాల హెచ్‌ఎం వెంకటరమణ విద్యార్థులకు నీరు తాగడంపై ప్రాథమికంగా అవగాహన కల్పించారు. శరీరంలో నీటి శాతం పెరిగితే రోగ నిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు.

ఘనంగా గెరిగ ఊరేగింపు



ఆలయంనుంచి ప్రారంభమైన గెరిగె ఊరేగింపు

రేణిగుంట ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రేణిగుంట గంగమ్మ జాతర మహోత్సవాలు గెరిగ ఊరేగింపుతో ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం గంగమ్మ ఆలయం నుంచి అమ్మవారి ప్రతిరూపమైన గెరిగ ఊరేగింపు ప్రారంభమైంది. చాకలి తలపై గెరిగను మోసుకు రావడంతో అడుగడుగునా భక్తులు టెంకాయలు కొట్టి హారతులు ఇచ్చారు. పట్టణానికి చెందిన సూర్యప్రకాష్ రెడ్డి కుటుంబీకులు అమ్మవారి మూలవిరాట్‌కు వెండి కవచాలను ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఇక ఊరందూరులో ఎమ్మెల్యే సుధీర్ స్వగృహానికి చేరుకున్న జాతర నిర్వాహకులు ఆయనకు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఆలయ ధర్మకర్త సోలా మల్లికార్జున్ రెడ్డి, కమిటీ సభ్యులు జ్యోతి నారాయణ, సదాశివరెడ్డి, రావణ, ఉమేష్, లక్ష్మణ్‌రెడ్డి, చిన్నబాబు, రాజేష్‌రెడ్డి, సూరి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు వద్దు

వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన



శ్రీకాళహస్తి విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద నిరసనలో వామపక్ష నాయకులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): అదానీ జేబు నింపే విద్యుత్ స్మార్ట్‌మీటర్లు ఏర్పాటును వెంటనే ఉపసంహరించుకోవాలని, సెకీ ఒప్పందంతో పాటు ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. శ్రీకాళహస్తి విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద సోమవారం సీపీఎం, సీపీఐ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం, సీపీఐ ఏరియా కార్యదర్శులు గంధం మణి, జనమాల గురవయ్య మాట్లాడుతూ... ప్రజల సంపదను లూటీ చేయడమే కాకుండా వారిపై విద్యుత్ భారం మోపడం సరికాదన్నారు. నాడు ప్రతిపక్ష నేతగా లోకేశ్ స్మార్ట్‌మీటర్లను పగులగొట్టాలని పిలుపునిచ్చారని దానికి ఆయన కట్టుబడి ఉండాలన్నారు. అనంతరం విద్యుత్‌శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అంగేరి పుల్లయ్య, పెనగడం గురవయ్య, వెంకటేష్, గురునాథం, శివకుమార్, గోపి, జాకీర్, ఆవాజ్, లాల్ బాషా, అలీ, అన్వర్‌బాషా పాల్గొన్నారు.

కేవీబీపురం (ఆంధ్రజ్యోతి): సీపీఎం ఆధ్వర్యంలో కేవీబీపురం సబ్‌స్టేషన్ వద్ద సోమవారం స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును నిరసిస్తూ ధర్నా చేశారు. సీపీఎం నాయకుడు జనార్దన్ ఆధ్వర్యంలో ఏఈ మునికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. వెంకటేష్, చంద్రయ్య, వెంకటయ్య, శంకరయ్య, రమణమ్మ, పద్మమ్మ పాల్గొన్నారు.

నాగలాపురం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విద్యుత్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు వద్దని పాత మీటర్లను కొన సాగించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ మండల అధికారి మునికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పద్మ, దక్షిణామూర్తి, పార్తిబన్, కస్తూరి, కన్నెప్పన్, మణి తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట (ఆంధ్రజ్యోతి): సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును వెనక్కు తీసుకోవాలని సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు రాజేశ్వరి మాట్లాడుతూ... స్మార్టమీటర్ల ఏర్పాటును వెంటనే ఉపసంహరించుకోవాలని, సర్దుబాటు చార్జీలని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. శివానందం, దిలీప్‌బాషా, సత్య, సెల్వరాజ్, ఈశ్వరమ్మ, రాజశేఖర్, దీప తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ, సీపీఎం మండల కార్యదర్శులు కత్తి ధర్మయ్య, ఎన్.రమణయ్య మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ప్పుడు కూటమి నాయకులు స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకించి నేడు అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని ఏర్పాటు చేయించడం భావ్యమా అని ప్రశ్నించారు. అనంతరం ఏఈ చలపతికి వినతిపత్రం అందజేశారు. నిరసన కార్యక్రమంలో బాలగురవయ్య, చొక్క లింగం, చింతపూడి, రమణయ్య, మణి, జేకే రమణయ్య, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): గృహాలకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఆపాలని సీపీఎం మండల కార్యదర్శి రమేష్ కోరారు. విద్యుత్ సెక్షన్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఏఈ రవికి స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయవద్దంటూ వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో అరుణాచలం, మురళి, కృష్ణయ్య, మునస్వామి, రాము, అముల్ రోస్లిన్, సుశీల, లక్ష్మి, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపానాయుడుపేటలో సీఐటీయూ, రైతు సంఘం ఆధ్వర్యంలో స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా సోమవారం ఏఈ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి కరీముల్లా మాట్లాడతూ స్మార్ట్‌మీటర్లు పెట్టుకుంటే వినియోగదారుల జేబులకు చిల్లులు పడుతాయన్నారు. రంగయ్య, రాంబాబు, గిరి, మస్తాన్, రుద్రదయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నాదెండ్లకు ముక్కంటి ప్రసాదాలు



శ్రీకాళహస్తి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కోడూరు మార్కెట్‌యార్డు చైర్మన్ ప్రమాణ స్వీకారానికి హాజరయ్యేందుకు తిరుపతి విమానాశ్రయం చేరుకున్నారు. ఆయన్ను జనసేన జిల్లా కార్యదర్శి కొట్టేసాయి మర్యాద పూర్వకంగా కలిసి ముక్కంటి ప్రసాదాలను అందజేశారు. గరికపాటి చంద్ర, చిరంజీవి, కవిత, లీలాధర్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుల నిరసన



శ్రీకాళహస్తి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్వీయే పురుషుల డిగ్రీ కళాశాల వద్ద అధ్యాపకులు సోమవారం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల బదిలీలు, పదోన్నతుల సమస్యలను పరిష్కరించాలన్నారు.

ఛలో విజయవాడ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



శ్రీకాళహస్తి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తెలుగుగంగ కార్యాలయంలో సోమవారం భోజన విరామ సమయంలో ఛలో విజయవాడ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీసీపీఎస్‌ఈఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనాథ్, తిరుపతి జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, శ్రీకాళహస్తి అధ్యక్షుడు గంగయ్య మాట్లాడుతూ... సెప్టెంబరు 1న విజయవాడకు ప్రతి సీపీఎస్ ఉద్యోగి తరలిరావాలన్నారు.

నేత్రపర్వంగా పార్వేట ఉత్సవం



శ్రీకాళహస్తి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఊరందూరు కొలువై ఉన్న అన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయ ఉత్సవాల్లో పార్వేట ఉత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. ముందుగా స్వామిఅమ్మవార్ల ఉత్సవ మూర్తులకు పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వేదికపై పార్వేట ఉత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే సుధీర్, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ పథకంతో నేతన్నకు చేయూత



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఉచిత విద్యుత్ పథకం ద్వారా చేనేత, మరమగ్గ కార్మికులకు సీఎం చంద్రబాబు చేయూతనందించారని ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం కైనికట్లు వీధిలో నేతన్నలు ఏర్పాటు చేసినా ధ్యాంక్యూ టూ సీఎం సార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సీఎం ఈనెల 7నుంచి నేతన్నకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేశారన్నారు. సూపర్ సిక్స్ హామీలో భాగంగా ఆగస్టు 15వ తేదీనుంచి మహిళలకు రాష్ట్రమంతా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అమలవుతుందన్నారు. చేనేత, మరమగ్గ కార్మిక సంఘ ప్రతినిధులు, అధికారులు, ప్రజాప్రతినిదులు కూటమి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమన్వయంతో ముందుకు వెళ్దాం

టీడీపీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శంకర్‌రెడ్డి



నీరువాయిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న శంకర్‌రెడ్డి తదితరులు

పిచ్చాటూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో కలసి పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకు రావాలని ఆ పార్టీ సత్యవేడు నియోజకవర్గ పార్టీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం వెంగళత్తూరు, నీరువాయి, కీళపూడి గ్రామాల్లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించారు. తిరుపతి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, నాయకులు సతీష్ యాదవ్, సతీష్‌నాయుడు, గంధమనేని రాజేష్, తిరుమలరెడ్డి, పద్మనాభరాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఫాతిమా



ఏర్పేడు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఎస్‌కే ఫాతిమా జాతీయ స్థాయిలో సెప్టెంబరులో గోవాలో జరగనున్న అథ్లెటిక్స్ పోటీలకు పోటీలకు ఎంపికైంది. బీపీ చదువుతున్న ఫాతిమా తిరుపతి జిల్లా తరపున బాపట్ల జిల్లా చీరాలలో ఈనెల 9, 10, 11 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌లో డిస్కస్‌త్రోలో ప్రథమ స్థానంలో, షాట్‌పుట్‌లో ద్వితీయ స్థానంలో నిలిచింది. పీడీ శివకుమార, తిరుపతి, చిత్తూరు జిల్లాల ఒలంపిక్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రోబో ఆమెను అభినందించారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ



కేవీబీపురం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): కొత్త చట్టాలపై అవగాహన కల్పించే విధంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని ఎస్పీ హర్షవర్ధన రాజు ఆదేశించారు. పుత్తూరు సబ్ డివిజన్‌లో కేవీబీపురం పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అపరిష్కృత కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టి త్వరితగతిన పరిష్కరించాలని ఎస్ఐ నరేష్‌కు ఎస్పీ సూచించారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. అలాగే స్టేషన్ పరిధిలో భూ వివాదాలపై ప్రత్యేక దృష్టి పెట్టి నిబంధనల ప్రకారం వ్యవహరించాలన్నారు. అలాగే వినాయక చవితి ఏర్పాట్లపై అడిగి తెలుసుకున్నారు.

ఆన్‌కాల్ డ్రైవర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాళహస్తి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపోలో ఆన్‌కాల్ డ్రైవర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మేనేజరు మునిచంద్రయ్య తెలిపారు. హెవీ లైసెన్సు తీసుకుని 18 నెలలు పూర్తయిన వారు ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీని దరఖాస్తుతో జతపరిచి ఈనెల12న మంగళవారం నుంచి ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమర్పించలన్నారు. వివరాలకు నెం.9959297947, 9063774464 లలో సంప్రదించాలన్నారు.

నేడు అన్నదాత సుఖీభవ విజయవంతంపై ర్యాలీ

శ్రీకాళహస్తి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకం విజయవంతం కావడంతో ట్రాక్టర్ ర్యాలీ చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం తెలిపింది. ఎమ్మెల్యే సుధీర్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి మండలం ఊరందూరు నుంచి ట్రాకర్ల ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. ట్రాక్టర్ ఇంజన్లు కలిగిన రైతులందరూ తీసుకురావాలన్నారు.

ముక్కంటి సేవలో కేరళ డీజీపీ



శ్రీకాళహస్తి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరు డిని సోమవారం కేరళ రాష్ట్ర డీజీపీ రావాడ ఆజాద్ చంద్రశేఖర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. టీడీపీ నాయకులు చెంచయ్యనాయుడు, ఎల్.మధుబాబు, కాసరం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ అరెస్టు అప్రజాస్వామికం

శ్రీకాళహస్తి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రాహుల్‌గాంధీ అరెస్టును నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ సమన్వయ కర్త తలపా దామోదరరెడ్డి ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. పార్లమెంట్ ప్రతిపక్ష నేత రాహుల్‌ను అరెస్టు చేయడం ప్రతిపక్షాల గొంతు నొక్కడమేనన్నారు. సురేంద్ర రెడ్డి, ఆంటోని, నాగరాజు, మహేష్, తరుణ్, సారథి తదితరులు పాల్గొన్నారు.

వేదోక్తంగా మృత్యుంజయస్వామికి పూజలు



శ్రీకాళహస్తి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాల యంలో కొలువై ఉన్న మృత్యుంజయ స్వామికి సోమవారాన్ని పురస్కరించుకుని వేదోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా వినాయకుడికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి కర్పూర హారతులు ఇచ్చారు. అనంతరం మృత్యుంజయుడిని పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంతో అభిషేకించారు. అనంతరం గజమాల, వెండి నాగాభరణంతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.